

దశ తిరిగినట్టే 6

- కాకినాడలో ఏఎంజీ మెటల్ కంపెనీ భారీ పెట్టుబడి
- రూ.44వేల కోట్లతో అల్యూమినియం స్మెల్టర్ ప్లాంట్
- కాకినాడ సూర్యారావుపేటలో నిర్మాణం
- ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

నిరుపేదల సొంతింటి కల సాకారం



రామచంద్రపురం మండలం వెల్లలో నూతన గృహప్రవేశంలో లబ్ధిదారులకు ఇంటి తాళం నమూనా అందచేస్తున్న మంత్రి సుభాష్, రామచంద్రపురం ఆర్డీవో అఖిల

- జిల్లాలో 8,876 గృహాల నిర్మాణం పూర్తి: కలెక్టర్
- కొత్త ఇళ్లు ప్రారంభం

అమలాపురంరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడంతోపాటు వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తు ఆనందరావు అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద అమలాపురం రూరల్ మండల పరిధిలో పాలగుమ్మి, జనుపల్లి గ్రామాల్లో పూర్తయిన గృహనిర్మాణాలను కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ టి.నిషాంతితో కలిసి ఆయన ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు నూతనవస్త్రాలు, స్వీట్లు పంపిణీ చేశారు. అర్హత గల పేదలకు రూ.1.50లక్షలు కేంద్ర సహాయంతోపాటు ఇంటి నిర్మాణానికి రాష్ట్రం తరపున రూ.లక్ష అందిస్తున్నామన్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వహయాంలో మంజూరైన 3లక్షల గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. వాటిలో జిల్లాకు సంబంధించి 8,876 గృహాల నిర్మాణాలు పూర్తికాగా లబ్ధిదారులకు అందించామన్నారు. రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని వెల్ల గ్రామంలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆయా గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు అందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి, గృహనిర్మాణ సంస్థ పథక సంచాలకుడు ఎంవీ నరసింహారావు, కార్యనిర్వాహక ఇంజనీర్ కె.సత్యనారాయణ, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మల్లుల పోలయ్య, మాజీ సర్పంచ్ దంగేటి వెంకటేశ్వరరావు, పొలమూరి ధర్మపాల్ పాల్గొన్నారు.



పాలగుమ్మిలో గృహాన్ని నిర్మించుకున్న లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు

పర్యవేక్షణా లోపం..
సేవలు అంతంతే!

'ఆంధ్రజ్యోతి' విజిట్..



రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడులో గ్రామ సచివాలయం

- సచివాలయాల్లో డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లపైనే పనిభారం
- వీరిపై సర్వేలు, యాప్‌ల నిర్వహణ సహా పలు బాధ్యతలు
- సచివాలయాల రీగ్రూపింగ్ విధానంతో పెరిగిన ఒత్తిడి
- కొన్ని శాఖలకు సంబంధించిన సిబ్బంది ఖాళీయే
- మహిళా పోలీసులు కొన్నిచోట్ల ఖాళీ.. కొన్నిప్రాంతాల్లో ఇంటి పన్నుల వసూళ్ల బాధ్యతల అప్పగింత
- జిల్లాలో 515 సచివాలయాలు.. 3,900 సిబ్బంది

(అమలాపురం-ఆంధ్రజ్యోతి బృందం)

పట్టణ, గ్రామ వార్డు సచివాలయాల రీగ్రూపింగ్ తర్వాత సచివాలయాల్లో ఉద్యోగుల పనితీరులో స్వల్పంగానే మార్పులు కనిపిస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆంధ్రజ్యోతి సచివాలయాలను విజిట్ చేసింది. జిల్లాలో 386 పంచాయతీల పరిధిలో పట్టణ, వార్డు సచివాలయాలు జిల్లావ్యాప్తంగా 515సచివాలయాలున్నాయి. వీటిలో 3,900మంది వరకు సిబ్బంది పనిచేస్తుండగా కొన్నిచోట్ల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. గ్రేడ్-4,5 సచివాలయాలను గ్రేడ్-3 కింద మార్పులు చేశారు. కానీ ఎక్కడా సచివాలయాల సంఖ్య తగ్గలేదు. విలీనాలు జరగలేదు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో సచివాలయాలు పనిచేస్తున్నాయి. ఒక్కో సచివాలయంలో పంచాయతీ సెక్రటరీతోపాటు వీఆర్వో,డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లకే పనిభారం నిరంతరం ఉంటోంది. ఫిషరీస్, వెటర్నరీ, అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉన్నప్పటికీ కొన్నిచోట్ల వారికి పనులు అంతంతమాత్రంగానే ఉంటున్నాయని తేలింది. జిల్లావ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ఉద్యోగులు హాజరు వేయించుకుని క్యాంపుల పేరుతో బయటకు వెళ్లిపోతున్నట్టు సమాచారం. సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లను అదనపు పనులకు నియమిస్తున్నారు. తీరప్రాంత మండలాల్లో మత్స్యకార గ్రామాలు ఉన్న ప్రాంతాల్లో ఫిషరీస్ అసిస్టెంట్లకు పనులు ఉన్నా మిగిలినచోట్ల ఖాళీగానే ఉంటున్నారు. డిప్యూటేషన్ పేరుతో సిబ్బందిని రెవెన్యూ కార్యాలయాల్లో విధుల్లో కొనసాగుతున్నట్టు సమాచారం. చాలా సచివాలయాల్లో ఆధార్ సెంటర్ల ఏర్పాటుతో అదనపు పనివారిపై పడింది. రైస్‌కార్డు పనులు కూడా వీరికి అప్పగించారు. కొన్నిచోట్ల మహిళా పోలీసులకు శిక్షణ లేకుండా డిజిటల్ అసిస్టెంట్లుగా పనులుఅప్పగించారు. మేజర్ పంచాయతీల పరిధిలో సచివాలయాలు సింగిల్‌గా ఉంచగా మైనర్‌పంచాయతీలు రెండేసి కలిపి గ్రూపింగ్ సిస్టంలో ఉద్యోగులకు పనులు కల్పించారు. కొన్నిసచివాలయాల్లో మహిళా పోలీసులను ఇంటి పన్నుల వసూళ్లకు నియమించారు. సర్వేయర్లను ప్రభుత్వ సర్వేల కార్యక్రమాలకు మళ్లించారు. తుఫాన్ సమయంలో సంభవించిన పంటనష్టాల కోసం వ్యవసాయ, ఉద్యాన శాఖలకు చెందిన అసిస్టెంట్లను గ్రామస్థాయిలో వినియోగించి నష్టాలను మదింపు చేశారు. ఇలా సిబ్బంది మాత్రం సచివాలయాల్లో విధులు నిర్వహించడం కంటే ఇతర కార్యకలాపాలకు ఉన్నతాధికారులు ఆదేశాలతో వారి సేవలను ఉపయోగించుకుంటున్నారని తేటతెల్లమైంది. మొంథా తుఫాన్ సమయంలో సచివాలయ ఉద్యోగులు అందించిన ముందస్తు సేవలకు సీఎం చంద్రబాబునుంచి ప్రశంసలు అందుకున్నారు.

కొందరికే పనిఒత్తిడి

ఆలమూరు మండలంలో 18 గ్రామ పంచాయతీలకుగాను 24 సచివాలయాలు ఏర్పాటు చేశారు. వీటిలో వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు మాత్రమే పని ఒత్తిడి ఉంటుంది. ముమ్మిడివరం మండలం పళ్లవారిపాలెంలోని సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉండగా సచివాలయంలో కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు పూర్తిస్థాయిలో ఉంది. మలికిపురం మండలంలో 21 సచివాలయాలు ఉండగా పలుచోట్ల సరిపడా సిబ్బంది లేరు. 14మంది గ్రేడ్-4 కార్యదర్శుల పోస్టుల ఖాళీగా ఉన్నాయి. వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు అన్ని సచివాలయాలకు లేరు. అల్లవరం మండలంలోని 23 సచివాలయాలను 11 గ్రూపులుగా రీ గ్రూపింగ్ చేయడంతో ఉద్యోగులకు పనులు కల్పించి బాధ్యతలు పెంచారు. రాజోలు మండలంలో 22 సచివాలయాల్లో 142 మంది సిబ్బంది పనిచేస్తుండగా పనిభారం ఎక్కువగా ఉంటుంది. సఖినేటిపల్లి మండలంలో 21 సచివాలయాలకు 157 ఖాళీలు ఉండగా 121 మంది ఉద్యోగస్తులే ఉన్నారు. 36 ఖాళీలు ఉన్నాయి. ప్రతి సచివాలయానికి 11మంది ఉద్యోగులు ఉండేవారు. కాలక్రమేణా ఏడుగురికి పరిమితమయ్యారు. సచివాలయ ఉద్యోగులు వాట్సాప్ గవర్నెన్స్ మిత్ర యాప్‌లు చేయడానికి ప్రజల వద్దకు వెళ్లడానికి నిరాకరించినా నెలరోజులుగా పనిచేస్తున్నారు. మండలంలో ఆరుగురు డిజిటల్ అసిస్టెంట్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 15 మంది డిజిటల్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రజలకు సేవలందక ఇక్కట్లకు గురవుతున్నారు. మామిడికుదురు మండలంలో 22 సచివాలయాలకుగాను, 11క్లస్టర్‌లుగా విభజించారు. 154మంది సిబ్బందిని క్లస్టర్‌లో సర్దుబాటు చేయడంవల్ల ఉద్యోగులు తమ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

సర్వర్లు పనిచేయక..

ఆత్రేయపురం మండలంలో 20సచివాలయాల్లో 156మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఇక్కడ పలుచోట్ల అంతర్జాలం సరిగ్గా పనిచేయకపోవడంతో సర్వర్ సహకరించక లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శుల నుంచి సిబ్బందికి పనిఒత్తిడి పెరుగుతోంది. కె.గంగవరం మండలంలో 23 సచివాలయాల్లో 205మంది పనిచేస్తున్నారు. వ్యవసాయశాఖ వీఏఏ, రెవెన్యూ అధికారి, సచివాలయ కార్యదర్శి, వెల్ఫేర్‌అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు తగిన పనిఉంటోంది. కపిలేశ్వరపురం మండలంలో 20గ్రామ, వార్డు సచివాలయాల్లో 162 పోస్టులు ఉండగా 138 మంది పనిచేస్తున్నారు. వీరిలో డిజిటల్, వెల్ఫేర్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, సచివాలయం, సెక్రటరీ, వీఆర్‌వోలు, సర్వేయర్లకు పనిభారం ఎక్కువగా ఉండి ఇబ్బందులు పడుతున్నారు. రీ గ్రూపింగ్ ఇంకా అమలు కావడంలేదు. పి.గన్నవరం మం డలంలో 23 సచివాలయాలకు గాను 161మంది సిబ్బంది పనిచేస్తున్నారు. డిజిటల్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 23 సచివాలయాలకు గాను 14మంది ఉన్నారు. రాయవరం మండలంలోని 12 గ్రామాల పరిధిలో 19 గ్రామ సచివాలయాల పరిధిలో వివిధ విభాగాల్లో 135మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. క్లస్టర్లుఉన్న గ్రామాల్లో సిబ్బందికి పని భారం పెరుగుతోంది. రావులపాలెం మండలంలోని సచివాలయాలలో పనిచేస్తున్న సిబ్బందికి తమకు కేటాయించిన పనులతోపాటు ఇతరశాఖల పనులతో ఒత్తిడి ఉంటోంది. రావులపాలెం మండలంలోని 12గ్రామాల్లో 23 సచివాలయాల్లో 10మంది డీఏలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన చోట్ల కొందరు రెండుశాఖల విధులు అదనంగా నిర్వర్తించాల్సి వస్తోంది. ఉప్పలగుప్తం మండలంలో 17 సచివాలయాల్లో 120మంది ఉద్యోగులున్నారు. ఒక్క రెవెన్యూ మినహాయిస్తే మిగిలిన వారెవరూ సమయానికి రావడం లేదు. ఈ కారణంగానే 40శాతం మంది తంబ్ వెయ్యడం లేదు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఫిషరీష్, వెటర్నరీ అసిస్టెంట్లకు పనులు అంతగా ఉండట్లేదు. మండపేట పట్టణంలో 14 సచివాలయాలు ఉండగా 102మంది సిబ్బందికిగాను కేవలం 98మంది ఉన్నారు. వీరిలో ఏడుగురు డిప్యూటేషన్‌పై వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. మండపేట రూరల్‌లో 23సచివాలయాలకు గాను 98మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా 64మంది మాత్రమే పనిచేస్తున్నారు. చాలాచోట్ల సిబ్బంది ఫీల్డ్ విజిట్‌లో ఉన్నట్టు చెప్తున్నారు.

రైతన్నకు.. గుండె కోత!

అలమూరులో వరికోత కోస్తున్న యంత్రం





మండపేటలో నేలకు వాలిన వరిపంటను కోస్తున్న కూలీలు

- ఖరీఫ్ కోతలకు పెరిగిపోయిన కూలీల ధరలు
- కోత మిషన్లకు డిమాండ్
- అదనపు చార్జీలు వసూలు
- తుఫాన్ దెబ్బకు తగ్గిన దిగుబడి
- రైతుల్లో ఆందోళన

అన్నదాతకు నిలువెల్లా నష్టమే.. ఇప్పటికే తుఫాన్‌తో వీచిన గాలుల వల్ల నష్టం.. తర్వాత భారీవర్షాలవల్ల మరో నష్టం.. ఇప్పుడు కోతలకు కూలీల ధర పెరిగిపోవడం ఇంకో నష్టం. ఈ తరుణంలో వరికోత మిషన్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో కోత యంత్రాల యజమానులు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. దీంతో రైతులకు గుండె'కోత' తప్పడంలేదు.

మండపేట/ఆలమూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దెబ్బకు జిల్లా పరిధిలో 70వేల ఎకరాలకు పైబడి ఖరీఫ్ వరి పంటకు నష్టం వాటిల్లినట్టు అధికారులు గుర్తించారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టగా, తమకు పంటచేతికి అందే సమయంలో వీచిన ఈదురుగాలులు, వర్షాలతో ధాన్యం దిగుబడి తగ్గిపోయిందని వారు వాపోతున్నారు. తుఫాన్ దెబ్బ కారణంగా ఎకరాకు పది బస్తాల వరకు పంటనష్టం ఉంటుందని చెప్తున్నారు. ఇదే సమయంలో రైతులకు మరో షాక్ తగిలింది. ఓ పక్క పెరిగిన కూలీల అదనపు ఖర్చు వేధిస్తుంటే ఇదే అదునుగా వరి పంట కోసే యంత్రాల యాజమానులు కూడా ధర పెంచేశారు. గతంలో గంటకు రూ.2600 నుంచి రూ.2800 చొప్పున వసూలు చేయగా అదే మిషన్‌కు ఇప్పుడు ఒక్కోచోట ఒక్కోలా గంటకు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు వసూలు చేస్తున్నారు. దీనికితోడు వరిపంట నేలకు వాలడంతో వరికోత ఆలస్యం అవుతోందని రైతులు వాపోతున్నారు.

కూలీలకు డిమాండ్

వరికోసేకూలీలకు చాలా డిమాండ్ ఏర్పడింది. పురుషుడికి రూ.900 ఆడమనిషికి రూ.800 చొప్పున చెల్లించాల్సి వస్తోందని రైతులు చెప్తున్నారు. పంటకు పెట్టుబడి పంట చేతికి అందే సమయానికి ఎకరాకు రూ.30వేల వరకు వ్యయమవుతోందని అంటున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పంటదిగుబడి తుఫాన్‌వల్ల ఎకరాకు 20 నుంచి 25 బస్తాలు మాత్రమే వస్తోందని, దీంతో పెట్టుబడులు కూడా చేతికి అందే పరిస్థితి కనిపించడం లేదని మండపేట మండలం పాలతోడుకు చెందిన రైతు పిల్లా తాతీలు తెలిపారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కేంద్రం బృందం పర్యటనతో..

జిల్లాలోని ఆలమూరు మండలం పెనికేరుతోపాటు పలుచోట్ల దెబ్బతిన్న పంటలను కేంద్ర బృందం మంగళవారం పరిశీలించింది. వీరి నివేదిక ఆధారంగా కేంద్రం కనికరించి ఆర్థిక సాయం అందించాలని రైతులు వేడుకుంటున్నారు. రంగుమారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు. జిల్లాలో మండపేట, రామచంద్రపురం,కొత్తపేట నియోజకవర్గాల్లో వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇక్కడ ఉత్తరాది జిల్లాలనుంచి వచ్చిన వలస కూలీలతోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన వరికోత యంత్రాలు ముమ్మరంగా వరికోతల్లో తలమునకలై ఉన్నాయి.

'విద్యార్థి మిత్ర' షూలు సైజులు మార్చి సరఫరా

అమలాపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర 2025-26 సంవత్సరానికి సంబంధించి షూల సైజులను మార్చి ప్రభుత్వం సరఫరా చేసింది. జిల్లాలో 7,587మంది విద్యార్థులకు షూలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నట్టు డీఈవో షేక్ సలీంబాషా తెలిపారు.

కేంద్ర సంక్షేమ పథకాల పురోగతిపై సమీక్ష

- దిశ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీ హరీష్
- పాల్గొన్న ఎమ్మెల్యేలు వేగుళ్ల, బండారు, ఎమ్మెల్సీ కుడుపూడి

అమలాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలపై విస్తృతస్థాయిలో అవగాహన కల్పించి ప్రతి లబ్ధిదారుడికి మేలు చేకూర్చేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అమలాపురం ఎంపీ, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ గంటి హరీష్ సూచించారు. జిల్లా దిశ కమిటీ మూడో సమావేశం కలెక్టరేట్‌లో దిశ చైర్మన్ హరీష్ అధ్యక్షతన బుధవారం జరిగింది. కమిటీ మెంబర్ చైర్మన్, జేసీ టి.నిషాంతి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైసీపీ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మండపేట, కొత్తపేట ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు పాల్గొన్నారు.జిల్లాలో డ్వామా, గృహనిర్మాణసంస్థ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, విద్యుత్, వ్యవసాయం, ఉద్యాన, విద్యాశాఖ, రహదారులు, ఆర్‌అండ్‌బీ రైల్వే, హ్యాండ్‌లూమ్స్, వైద్యఆరోగ్యశాఖ వంటి వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ప్రాజెక్టుల పురోగతిని సమావేశంలో సమీక్షించారు. జేసీ నిషాంతి కేంద్ర ప్రభుత్వపథకాల అమలును, జిల్లాలో వివిధ శాఖలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించి సమన్వయంతో పనిచేయాలన్నారు. అభివృద్ధిలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అజెండాలోని ప్రధాన అంశాలను సమీక్షించారు. పథకాల అమలుపై కేంద్ర ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి నిధులు తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తానని చైర్మన్ హరీష్ హామీఇచ్చారు. జాతీయ రహదారులను అభివృద్ధి చేయాలని, రైల్వే ప్రాజెక్టు నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని కమిటీ సూచించింది. సమావేశంలో జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీఆర్వో మాధవి, ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడారు.



మాట్లాడుతున్న ఎంపీ హరీష్, హాజరైన ఎమ్మెల్యే వేగుళ్ల, జేసీ నిషాంతి

అమలాపురంలో రన్ ఫర్ యూనిటీ

అమలాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యతా స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలని ఎంపీ గంటి హరీష్ పిలుపునిచ్చారు. అమలాపురం పట్టణంలోని ఎస్కేబీఆర్ కళాశాల నుంచి గడియారస్తంభం సెంటర్ వరకు జరిగిన రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో ఆయనతోపాటు కలెక్టర్ మహేష్‌కుమార్, డీఎస్పీ ప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, నాయకులు మానేపల్లి అయ్యాజీవేమా, పెచ్చెట్టి చంద్రమౌళి, నల్లా పవన్‌కుమార్, చిక్కాల గణేష్, బోనం సత్యప్రసాద్, ఆశెట్టి ఆదిబాబు, తాడి నరసింహారావు, నల్లా అజయ్, ఆర్వీ నాయుడు, మోకా సుబ్బారావు, పొలూరి సత్యానందంతోపాటు వివిధ పార్టీల రాజకీయ నాయకులు, అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ జెండాలతో ప్రదర్శన చేస్తూ గడియార స్తంభం సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడి సభలో ఎంపీ హరీష్‌మాధుర్ మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ పుట్టినరోజున జాతీయ ఐక్యతా దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని, దేశ ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ప్రధాని మోదీ ఈ కార్యక్రమం చేపట్టారని అన్నారు. వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొనగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన వారికి ప్రశంసాపత్రాలు అందించారు.



అమలాపురంలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీ, కలెక్టర్




పోల్ వాల్ట్‌లో మేటి క్రీడాకారుడు రవి

విద్యార్థి దశ నుంచే ఆటలపై మక్కువ. అతడిలో ఉన్న నైపుణ్యాన్ని కోచ్ గమనించి శిక్షణ ఇచ్చి పోల్‌వాల్ట్ బరిలో దింపాడు. అరకొరగా ఉన్న సౌకర్యాలను వినియోగించుకుంటూనే జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. పోల్‌వాల్ట్ బరిలో అతను అడుగుపెడితే పతకం ఖాయమనే పేరు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం చదువు పూర్తి చేసుకుని ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి మరింత ఉన్నత స్థాయి శిక్షణ ఇస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధిండం తన లక్ష్యమని చెప్తున్నాడు.



- పోల్‌వాల్ట్‌లో సత్తా చాటుతున్న పిఠాపురం క్రీడాకారుడు సాలా రవి
- విద్యార్థి దశ నుంచే పతకాల వేట
- ఇప్పటికే జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో 20 స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కైవసం
- సౌకర్యాలు కల్పిస్తే అంతర్జాతీయ పోటీల్లోనూ పతకాలు సాధిస్తానని ధీమా

అడుగు పెడితే పతకమే



(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణానికి చెందిన సాలా రవి పోల్‌వాల్ట్ క్రీడలో రాణిస్తూ పతకాలు పంట పండిస్తున్నాడు. ఇతడికి చిన్ననాటి నుంచే క్రీడలపై మక్కువ అధికం. ఆ సమయంలో చదువుకునే పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎలిపే సునీల్‌దేశాయి ఇతనిలో ప్రతిభను గుర్తించి పోల్‌వాల్ట్‌లో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఎటువంటి సౌకర్యాలు అందుబాటులో లేకపోయినా కోచ్ సమకూర్చిన వాటితోనే శిక్షణ పొంది నగరాల్లో అత్యాధునిక క్రీడా మైదానాల్లో శిక్షణ పొందిన వారితో పోటీ పడి పతకాలు సాధించడం ప్రారంభించాడు. ఇతని పేరు ఎంత ఎలా మారుమోగింది అంటే రవి పోల్‌వాల్ట్ బరిలో దిగితే పతకం ఖాయమని ముందే చెప్పే వరకూ. ప్రస్తుతం డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఒక వైపు ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుంటూనే పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుతున్నాడు.

బరిలో దిగిన నాటి నుంచీ...

ఉన్నత పాఠశాల స్థాయిలో బరిలో దిగిన నాటి నుంచీ రవి పోల్‌వాల్ట్‌లో తన ప్రతిభ చాటుకుంటూనే వస్తున్నాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ఇప్పటిదాకా 15 స్వర్ణ, 2 రజత, 3 కాంస్య పతకాలు సాధించాడు. అండర్-18, అండర్-20, అండర్-23, యూనివర్సిటీ, అంతర్ యూనివర్సిటీల కేటగిరీల్లో ఏ పోటీ జరిగినా విజేత ఇతడే. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం, గుంటూరు నాగార్జున యూనివర్సిటీ, అమలాపురంల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లోను, జార్ఖండ్, తమిళనాడు, కేరళ, తెలంగాణలోని కరీంనగర్, ఏపీలోని గుంటూరు నాగార్జున యూనివర్సిటీల్లో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్-పోల్‌వాల్ట్ పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. ఆంధ్రప్రదేశ్ తరఫున జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు.



రవిని అభినందిస్తున్న విశ్రాంత అడిషనల్ ఎస్పీ అరిటాకుల శ్రీనివాసరావు, గుంటూరులో జరిగిన అంతర్ యూనివర్శిటీ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన రవి (పాత చిత్రాలు)

ఉద్యోగ వేటలో: పోల్‌వాల్ట్ క్రీడలో 20 పతకాలు సాధించిన క్రీడాకారుడు సాలా రవి ప్రస్తుతం ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. చదువు పూర్తి కావడంతో ఏదైనా ప్రభుత్వరంగ సంస్థ లేదా రాష్ట్ర ప్రభుత్వం తన ప్రతిభను గుర్తించి ఉద్యోగ అవకాశం కల్పిస్తుందనే ఆశతో ఉన్నాడు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా కోచ్ ఎలిపే సునీల్‌దేశాయి ప్రోత్సాహంతో ఇప్పటికీ పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుతున్నాడు. ఇదే సమయంలో నగరాల్లో ఉన్న పోల్‌వాల్ట్ అత్యాధునిక సౌకర్యాలను పిఠాపురంలో కల్పిస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధిస్తానని ధీమాగా చెప్తున్నాడు రవి. ఇతడి ప్రతిభను గుర్తించి ప్రభుత్వం ఉద్యోగావకాశం కల్పిస్తే పలువురు క్రీడాకారులకు స్ఫూర్తిగా ఉంటుందని క్రీడాభిమానులు అభిప్రాయపడుతున్నారు.



ప్రభుత్వం అండగా నిలిస్తే పతకాల పంట పండిస్తాం

ఎలిపే సునీల్ దేశాయి, వ్యాయామ ఉపాధ్యాయుడు, కోచ్, పిఠాపురం

ప్రభుత్వం అండగా నిలిచి పోల్‌వాల్ట్ సహా అన్ని క్రీడలకు అవసరమైన మరిన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తే మన క్రీడాకారులు పతకాల పంట పండిస్తారు. పిఠాపురం నుంచి ఎంతోమంది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఉన్నారు. పోల్‌వాల్ట్‌లో సాలా రవి మంచి ప్రతిభ కనబరుస్తున్నాడు. ఉన్న సౌకర్యాలతోనే అతడికి శిక్షణ ఇచ్చి, ఇతర రాష్ట్రాల క్రీడాకారులతో పోటీ పడేలా తీర్చిదిద్దాము. ఇలాంటి వారిని ప్రభుత్వం ప్రోత్సహించడంతో పాటు ప్రత్యేక కోటా కింద ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే బాగుంటుంది. ఇలాంటి వారిని చూసి మరింత మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులుగా తయారవుతారు.

అందరూ ఆడుతుంటే ఆసక్తి కలిగింది

సాలా రవి, పోల్‌వాల్ట్ క్రీడాకారుడు, పిఠాపురం



పాఠశాలల్లో చదువుకునే సమయంలో మా సీనియర్లకు మా వ్యాయామ ఉపాధ్యాయుడు సునీల్‌దేశాయి శిక్షణ ఇవ్వడం చూశాను. నాకూ పోల్‌వాల్ట్‌పై ఆసక్తి కలిగింది. ఇతర క్రీడల్లో ప్రావీణ్యం ఉన్నా పారే పోల్ వాల్ట్‌లో కోచ్ సునీల్‌దేశాయి ప్రోత్సహించి శిక్షణ ఇచ్చారు. దీంతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటగలిగాను. ఉన్న సౌకర్యాలతోనే 20 పతకాలు సాధించాను. ఇక్కడ పూర్తిస్థాయిలో ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని ఉంది.


ఏజెన్సీలో సాగవుతున్న నల్ల ధాన్యం పంట

నల్ల బియ్యం.... ఆరోగ్యకరం

'తూర్పు' మన్యంలో విస్తరిస్తున్న సాగు

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

సాగుకు పెట్టుబడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆ వ్యయాన్ని రాబట్టుకోవడానికి అధిక దిగుబడులు వైపు అడుగులు వేస్తున్నారు. ఇందుకు రసాయనాలు వినియోగించాల్సి రావడం... అవి తిన్నవారు వ్యాధుల బారిన పడి చివరకు ఆసుపత్రులపాలవుతుండడం చూస్తున్నాం. కాగా ఇటీవల పల్లెలు మొదలుకొని పట్టణాల వరకు సేంద్రియ పంటల వినియోగం వైపు మొగ్గుచూపుతున్నారు. ఆ మేరకు అందుబాటులో వున్న రైతుల వద్ద నేరుగా ఆయా పంటలను కొనుగోలు చేయలేని పక్షంలో ఆన్‌లైన్‌లను ఆశ్రయిస్తున్నారు. సాధారణ సాగు పంటలతో పోల్చితే సేంద్రియ పంటల ధరలు ఎక్కువగా ఉండడం, డిమాండ్ కూడా పెరుగుతుండడంతో రైతులు కూడా సేంద్రియ సాగువైపు ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తున్నారు. ప్రధానంగా నల్ల బియ్యం, బ్రౌన్‌రైస్, దంపుడు బియ్యం విక్రయాలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. వాటి ధరలు కూడా అధికంగా ఉన్నప్పటికీ వినియోగ శాతం రోజురోజుకూ పెరుగుతూ వస్తోందని విక్రయదారులు చెప్తున్నారు.

ఇదిలా వుండగా అల్లూరి జిల్లా చింతూరు మండలంలోని చట్టి, వీరాపురం, ఎటపాక మండలంలోని కేఎస్ పురంలో ఈ ఏడాది కొద్దిమంది రైతులు నల్ల ధాన్యం (బియ్యం) సాగు చేస్తున్నారు. చట్టికి చెందిన రవ్వ అంజి, గౌరి, సీతారామయ్య తదితరులు నల్ల ధాన్యాన్ని పండించి సొంతంగా వినియోగించుకుంటున్నారు. ఈ బియ్యం తినడం ద్వారా ఆరోగ్యం కూడా మెరుగుపడుతోందని వారు చెప్తున్నారు. కాగా పంట ఏపుగా పెరగడంతో గాలికి కిందకు పడిపోతోందని, సాధారణ వరి కంటే దిగుబడి తక్కువగా ఉంటోందన్నారు. మార్కెట్లో నల్ల బియ్యం ధర కిలో రూ.200 వరకు ఉంది. నల్ల ధాన్యం వంగడాలను ఆసక్తి గల రైతులకు అందిస్తున్నామని అంజి చెప్పారు.





నల్ల ధాన్యం పండిస్తున్న గౌరి, అంజి

హిందీలో చేతిరాత బైబిల్ ఆవిష్కరణ


రచయిత శాంతకుమారిని అభినందిస్తున్న మాజీ ఎంపీ ఉండవల్లి

- కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి దుర్గేష్, మాజీ ఎంపీ ఉండవల్లి
- రచయిత శాంతకుమారికి అభినందన

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలుగు, ఆంగ్ల భాషల్లో బైబిల్‌ని చేతిరాతతో పూర్తిచేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయిని శాంతకుమారి తాజాగా హిందీలో కూడా చేతిరాతతో బైబిల్‌ను పూర్తిచేయడం అభినందనీయమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. స్థానిక లూథర్ గిరి క్రైస్ట్ చర్చిలో బుధవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆయన విచ్చేసి సదరు బైబిల్‌ను ఆవిష్కరించారు. పేపర్ మిల్ ఐఎన్‌టీయూసీ నేతగా, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా సుపరిచితుడైన బయ్యా జోసెఫ్ రాజు పుట్టినరోజు సందర్భంగా ఆయన సతీమణి శాంతకుమారి రాసిన హిందీ వెర్షన్ చేతిరాత బైబిల్‌ను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. మరో ముఖ్య అతిథిగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ జోషి అజాత శత్రువని, ఉండవల్లి, జక్కంపూడి, జోషి కాంబినేషన్‌లో రాజకీయాలు అద్భుతంగా నడిచాయన్నారు. పేపర్‌మిల్ ఉన్నంతకాలం జోషి పేరు వినిపిస్తుందన్నారు.మూడు భాషల్లో బైబిల్‌ని చేతిరాతతో పూర్తిచేయడం ఎక్కడా లేదని,దీనిపై గిన్నీస్ బుక్ రికార్డు కోసం దరఖాస్తు చేయాలని అందుకు అవసరమైన సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు, జక్కంపూడి విజయలక్ష్మి , సహస్ర, కోలమూరు ప్రభాకరరావు, రెవ జి.విలియమ్స్, డేవిడ్‌కుమార్, ప్రార్థనాకుమార్, శ్రీకాంత్ జేమ్స్, పెర్సి హేరామ్స్, నెల్సన్ ప్రాన్సిస్, చక్రవర్తి, ఆనంద్‌కుమార్, డానియల్ బి.రవి, శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం, పంతం కొండలరావు, టీకే విశ్వేశ్వరరెడ్డి, అశోక్‌కుమార్ జైన్, నక్కా రాజబాబు పాల్గొన్నారు.

18 ఏళ్ల లెలావాయి రైతుల నిరీక్షణకు ఫలితం

ఎట్టకేలకు పోలవరం నిర్వాసిత రైతులకు వడ్డీతో సహా బ్యాంకు ఖాతాలో జమ

కూనవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని లెలావాయి ప్రాంతంలోని భూములున్న పోలవరం నిర్వాసిత రైతుల నిరీక్షణ 18 ఏళ్ల తర్వాత ఫలించింది. వాస్తవానికి ఈ ప్రాంతంలోని భూములకు ఉమ్మడి రాష్ట్రంలో 2007లోనే పరిహారం రావాల్సి ఉంది. అప్పట్లో సీపీఎం పార్టీ పోలవరం ప్రాజెక్టు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు చేపట్టింది.ఈ ప్రాంతంలో భూముల సర్వేకు వచ్చిన అధికారులను సీపీఎం నాయకులు గదుల్లో వేసి నిర్బంధించేవారు. అప్పటి నుంచి ఈ భూముల సర్వే నిలిచిపోయింది. మళ్లీ రెండేళ్ల క్రితం సర్వే నిర్వహించి అవార్డు ఎంక్వైయిరీ నిర్వహించినప్పటికీ జగన్ ప్రభుత్వం రైతులకు పరిహారం ఇవ్వలేదు. అయితే కూటమి అధికారంలోకి రాగానే ఈ భూములకు వడ్డీతో సహా బుధవారం రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేసింది. వాస్తవానికి పోలవరం ప్రాజెక్టు కారణంగా భూములకు ఎకరానికి రూ.10.80 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుంది. కానీ వడ్డీతో సహా రూ.1,47,178 కలిపి రూ.12,27,178 ఒక ఎకరానికి చెల్లించింది.ఈ లెలావాయి భూముల్లో కూనవరం, టేకులబోరు, భీమవరం గ్రామాలకు చెందిన 46మంది రైతులు ఉండగా 128 ఎకరాల 90 సెంట్లు భూమి ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులకు మాత్రం ఐఎఫ్‌సీ కోడ్ మారిపోవడంతో వారి బ్యాంకుల్లో డబ్బులు కావడానికి కొంత ఆలస్యం అవుతుంది. చాలా సంవత్సరాల తర్వాత పరిహారం రావడంతో నిర్వాసితులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఆర్ఎంసీ ఈఎన్‌టీ అసోసియేట్ ప్రొఫెసర్‌కు ఉద్యోగోన్నతి

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ)లో ఈఎన్‌టీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ప్రవీణకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెకు ప్రొఫెసర్ హోదా కల్పిస్తూ ఆర్ఎంసీ ఈఎన్‌టీ విభాగంలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులో నియమించింది. స్పౌజ్, పరిపాలనా కోణంలో ఉద్యోగోన్నతి ఇచ్చినట్టు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ జీవోఆర్‌టీ నెం.787లో పేర్కొంది.

జాతీయ స్క్వాష్ పోటీలకు పిఠాపురం విద్యార్థినులు


పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ఎంఈవో

పిఠాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్క్వాష్ పోటీలకు కాకినాడ జిల్లా పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులు ఎంపికయ్యారు. కాకినాడలో జరిగిన అంతర జిల్లాల స్క్వాష్ పోటీల్లో ఇంటర్ బైపీసీ సెకండియర్ విద్యార్థిని బూర వెన్నెల, ఎంపీసీ ఫస్టియర్ విద్యార్థిని మందేపల్లి తేజస్విని, 8వ తరగతి విద్యార్థిని గుత్తుల మహాలక్ష్మిలు ప్రతిభ చూపగా రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. అండర్-14, 17 విభాగాల్లో జనవరి 3నుంచి 8వ తేది వరకూ డిల్లీలో, అండర్-19 విభాగానికి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో డిసెంబరు 8, 9వ తేదీల్లో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారు. జాతీయ పోటీలకు ఎంపికైన బాలికలను, వ్యాయామ ఉపాధ్యాయులు కె.మంగాయమ్మ, వీపీఎస్ శేషుకుమారి, డి.సత్యప్రియలను డీవైఈవో సత్యనారాయణ,ఎంఈవోలు శ్యాంబాబు, నారాయణదాసు, విద్యాకమిటీ చైర్మన్ విజయలక్ష్మి తదితరులు అభినందించారు.

దశ తిరిగినట్టే!

- కాకినాడలో ఏఎంజీ మెటల్ కంపెనీ భారీ పెట్టుబడి
- రూ.44వేల కోట్లతో అల్యూమినియం స్మెల్టర్ ప్లాంట్
- కాకినాడ-ఉప్పాడ బీచ్‌రోడ్డులోని సూర్యారావుపేటలో నిర్మాణం
- పలు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడకు మరో భారీ పెట్టుబడి వచ్చింది. ఏకంగా రూ.44 వేల కోట్లతో ఏఎంజీ మెటల్ అండ్ మెటీరియల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ అల్యూమినియం స్మెల్టర్ ఏర్పాటుకు నిర్ణయించింది. కాకినాడ-ఉప్పాడ బీచ్‌రోడ్డులోని పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని యు.కొత్తపల్లి మండలంలోని సూర్యారావుపేటలో ఈ కంపెనీ ఏర్పాటుకానుంది. ఈ మేరకు భారీ పెట్టుబడితో ముందుకు వచ్చిన ఈ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పారిశ్రామిక ప్రోత్సాహకాలు ప్రకటించాలని నిర్ణయించింది. ఈమేరకు పరిశ్రమల శాఖ బుధవారం జీవో ఎంఎస్ నెంబరు 201 పేరుతో ఉత్తర్వులు జారీ చేసింది.గతంలో సూర్యారావుపేటలో స్పెక్ట్రమ్ పవర్ ప్లాంట్ ఉండేది. ఆ తర్వాత దాన్ని విక్రయించేసింది. ఇప్పుడు అందులో ఈ కొత్త పరిశ్రమ రాబోతోంది. ఈ కంపెనీ 800 ఎకరాల్లో స్థాపించి ఏడాదికి ఒక మిలియన్ టన్ను అల్యూమినియం స్మెల్టర్‌ను పూర్తి పర్యావరణ హిత విద్యుత్ ఉపయోగించి ఉత్పత్తి చేయనుంది. ఈ కంపెనీకి తెరవెనుక పూర్తి సహాయ సహకారాలను నెదర్లాండ్స్‌లో ఏర్పాటు చేసిన ఏఎం గ్రీన్ అందించనుంది. కంపెనీ స్థాపనలో భాగంగా ఏఎంజీ సంస్థ భూమి,భూ అభివృద్ధికి రెండు దశల్లో రూ.1800 కోట్లు, భవనాలు, ఇతర సివిల్ పనులకు రెండు దశల్లో రూ.2,950 కోట్లు, ప్లాంట్, ఇతర యంత్రాలకు రెండు దశల్లో రూ.30,300 కోట్లు, ఇంకా ఇతర ఖర్చులు కలిపి మొత్తం తొలిదశ కింద రూ.24,250 కోట్లు, రెండో దశ కింద రూ.19,750 కోట్లు కలిపి మొత్తం రూ.44 వేల కోట్లు పెట్టుబడి పెడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వానికి వివరించింది. తొలి దశలో 0.5 మిలియన్ టన్నులు, రెండో దశలో 0.5 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయనుంది. తద్వారా మొత్తం 3వేల మందికి ఉపాధి కల్పించనున్నట్టు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చింది. ఈ మేరకు పెట్టుబడుల ప్రతిపాదన వివరాలను ఈ సంస్థ ఈ నెల 7న రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ) ఎదుట ఉంచింది.ఈ నేపథ్యంలో ఎస్ఐపీబీ సిఫార్సుల మేరకు ఈ సంస్థకు సూర్యారావుపేటలో 250 ఎకరాల భూ కేటాయింపునకు ప్రభుత్వం అనుమతి ఇస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. అలాగే కంపెనీ ఉత్పత్తికి సహకరించడంలో భాగంగా గ్రీన్ కారిడార్ విధానంలో 2,500 మెగావాట్ల విద్యుత్, నీటి అవసరాలు తీర్చే విధంగా 17.2ఎంఎల్‌డీ నీటి సరఫరా చేయనుంది. అలాగే భారీ పరిశ్రమ కేటగిరీలో ఈ కంపెనీని చేర్చి అన్ని ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన అన్నిరకాల అనుమతులు వేగంగా జారీ చేయడం, అలాగే వాటర్ ఫ్రంట్ యాక్సెస్ కింద మల్టీపర్పస్ బార్జి డాక్ నిర్వహణకు అనుమతులు జారీ చేసింది. అంటే ఈ కంపెనీ ఎదురుగా ఉన్న ఉప్పాడ సముద్రం వద్ద ప్రత్యేక బెర్త్ నిర్మించి నేరుగా విదేశాల నుంచి కావలసిన పరికరాలు, యంత్రాలు, ఇతర ఉత్పత్తులు నౌకల్లో తీసుకురానుంది. అలాగే కంపెనీ రెండు దశల్లో పెట్టనున్న రూ.37,150 కోట్ల ఫిక్స్‌డ్ క్యాపిటల్ పెట్టుబడికి సంబంధించి ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ పది సంవత్సరాల పాటు 15శాతం, విద్యుత్ సుంకం నూరు శాతం పాతిక సంవత్సరాల పాటు మినహాయింపు, కారుచౌక ధరకు 25ఏళ్లపాటు నీటి సరఫరా, స్టాంపు డ్యూటీ, భూమార్పిడి, రిజిస్ట్రేషన్ ఫీజులు నూరు శాతం(250ఎకరాల భూ కొనుగోలుపై రూ.28 కోట్లకు మించకుండా) మినహాయింపు ఇస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఏం ఉత్పత్తి చేస్తారు..?

అల్యూమినియం స్మెల్టర్ ప్లాంట్ అంటే అల్యూమినియం ఆక్సైడ్ నుంచి విద్యుద్విశ్లేషణ ప్రక్రియ ద్వారా అల్యూమినియాన్ని వెలికితీసే ప్లాంట్. ఈ ప్రక్రియ కోసం ప్లాంట్‌కు భారీగా విద్యుత్ అవసరం. దీన్ని గ్రీన్ ఎనర్జీ కింద చలమశెట్టి అనిల్ కంపెనీ అయిన ఏఎం గ్రీన్ అందిస్తుంది. ఈ ప్లాంట్‌కు బాక్సైట్ ఖనిజం నుంచి తీసిన అల్యూమినియాన్ని ముడి పదార్థంగా ఉపయోగిస్తారు. ఈప్లాంట్ ద్వారా ఉత్ప త్తయ్యే వస్తువులు ఉక్కు, రాగి, జింక్, సీసంకు ప్రత్యామ్నాయంగా వాడతారు. ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తయ్యే అల్యూమినియాన్ని ఇం గోట్స్ రూపంలో పోస్తారు. దీన్ని కరిగించి బిల్లెట్స్, వైర్‌రాడ్‌లు, అల్యూమినియం షీట్లు, కాయిల్స్ వంటివి తయారు చేస్తారు.

శైవ క్షేత్రాలు దర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు


గురమంద జలపాతం వద్ద ట్రైనీ ఐఏఎస్‌లు



వై.రామవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాలు పర్యటించేందుకు వచ్చిన 12 మంది ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ ఎస్‌ల బృందం బుధవారం మూడోరోజు మండలంలోని శైవ క్షేత్రాలను దర్శించుకుంది. గిరిజనుల జీవన విధానం, అలవాట్లు, మౌలిక వసతులు కల్పన తదితర అంశాలపై అధ్యయనం చేయడంతో పాటు కార్తీక మాసం సందర్భంగా అటవీ ప్రాంతంలో ఉన్న గురమంద విశ్వనాథస్వామి,పూతి గుంట శివాలయాలు సందర్శించారు. ప్రకృతి జలపాతాల్లో సందడి చేశారు. వారి వెంట ఎంపీడీవో బాపన్న దొర, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నన్నయ ఫాస్టెస్ట్ మహిళగా విహారిక


నాగవిహారికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఆంజనేయులు

కాకినాడ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం(అక్నూ) అథ్లెటిక్ పోటీల్లో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని బి.నాగవిహారిక ప్రతిభ కనబరిచింది. 100, 200 మీటర్ల పరుగు పోటీల్లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించిందని పీఆర్వో జయదేవ్ తెలిపారు. అక్నూ పరిధిలోని పరుగు పోటీల్లో అత్యంత తక్కువ సమయంలో ఈవెంట్‌ను పూర్తిచేసిన మహిళగా నమోదు కావడంతో యూనివర్శిటీ స్థాయిలో ఫాస్టెస్ట్ మహిళగా నిలిచిందన్నారు. జనవరి 12న బెంగళూరులో జరిగే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ అథ్లెటిక్ పోటీల్లో అక్నూ తరపున పాల్గొంటుందని తెలిపారు. నాగవిహారికను ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు, పీడీలు వర్మ, రమణ, దుర్గారావు, వెంకటేశ్వరరావు అభినందించారు.

హెచ్ఎం నిర్మలకుమారికి బెస్ట్ టీచర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నిర్మల కుమారి

కాకినాడ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కాకినాడలోని జగన్నాథపురం సెయింట్ ఆన్స్ హైస్కూల్ హెచ్ఎం నిర్మల కుమారి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరూఖ్ నుంచి బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్నారు. ముస్లిం ఉపాధ్యాయులతో పాటు పది మంది క్రైస్తవ ఉపాధ్యాయులను, పది మంది క్రైస్తవ విద్యార్థులను అవార్డులకు ఎంపిక చేయడం పట్ల టీడీపీ క్రైస్తవ విభాగం రాష్ట్ర నాయకుడు ప్రొఫెసర్ మోసిగంటి జోసెఫ్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థి వేలాడొద్దు!

ఆర్టీసీ బస్సుకు వేలాడుతూ ప్రమాదమని తెలిసినా విద్యార్థులు అలానే ప్రయాణిస్తున్నారు. కళాశాలలుకు విద్యార్థులు వెళ్లే ఉదయం, సాయంత్రం సమయాల్లో సరిపడా బస్సులు లేకపోవడం, కళాశాలలుకు సకాలంలో వెళ్లాలనే ఆతృతతో డోర్ వద్ద వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం ఉప్పాడ బస్టాండు వద్ద బుధవారం ఉదయం కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది. (పిఠాపురం-ఆంధ్రజ్యోతి)



సూర్యుడిలో చంద్రుడు!

ఇక్కడ మబ్బుల్లో కనిపిస్తున్నది చంద్రుడు కాదు సూర్యుడు. చంద్రుడి మాదిరిగా మబ్బుల్లో నుంచి కనిపించిన సూర్యుడిని పలువురు కనులారా వీక్షించారు. కాకినాడ జిల్లా పిఠాపురం-గొల్లప్రోలు మధ్య గల జాతీయ రహదారిపై నుంచి ఆకాశంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)



దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా దుర్ఘటన

- ఆటోను ఢీకొన్న లారీ
- ఆటో డ్రైవర్ మృతి... ఐదుగురు మహిళలకు తీవ్రగాయాలు
- ప్రత్తిపాడు హైవేపై ఘటన



సంఘటనా స్థలంలో ఆటో



మరణించిన ఆటో డ్రైవర్ ఆదివిష్ణు

ప్రత్తిపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై బుధవారం ఆటోను గుర్తు తెలియని లారీ ఢీ కొన్న దుర్ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందగా ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం కిర్లంపూడి మండలం ముక్కోలు గ్రామానికి చెందిన ఆరుగురు మహిళలు ఆటోలో ఇర్రిపాకలోని శివాలయానికి వెళ్లి దర్శనం చేసుకుని తిరిగివస్తున్నారు. ప్రత్తిపాడు గోవిందపురం కొండ జంక్షన్ వద్ద ఆటో ప్రత్తిపాడు గ్రామంలోకి మలుపు తిరిగేందుకు రహదారిపై వేచి ఉండగా వెనుక నుంచి రాజమండ్రి నుంచి అన్నవరం వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ వేగంగా ఢీకొంది. ఆటో డ్రైవర్ ఆర్.రాము ఆదివిష్ణు (54) తీవ్ర గాయాలపాలై మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న దొడ్డా వీరలక్ష్మి, కామిరెడ్డి గనిలక్ష్మి, కోలం సరోజిని, ఉమ్మిడి సీతామహాలక్ష్మి, వాసిరెడ్డి సత్య తీవ్రంగా యపడ్డారు. మహిళలకు స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స జరిపి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. ఆదివిష్ణు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించి ప్రత్తిపాడు ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో కాలభైరవ స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

– ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి)

మార్మోగిన సత్యదేవ నామస్మరణ

- అన్నవరం దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో పడిపూజా కార్యక్రమం
- తరలివచ్చిన సత్యదీక్షా పరులు





పడిపూజ నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి ప్రాంగణం బుధవారం రాత్రి సత్యదేవ నామస్మరణతో మార్మోగింది. జిల్లా నలుమాలల నుంచి వేలాదిగా తరలివచ్చిన దీక్షాపరులతో ఆలయ ప్రాంగణం పసుపుమయంగా మారింది. అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజా కార్యక్రమాన్ని దీక్షాపరులంతా భక్తిశ్రద్ధలతో ఆచరించారు. వార్షిక కల్యాణవేదిక వేదికపై అరటిడొప్పలతో అలంకరించిన వివిధ మండపాల్లో ప్రధానంగా సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను కుడివైపున క్షేత్రపాలకులు సీతారాములు, గణపతి, ఎడమభాగంలో పార్వతీ,పరమేశ్వరుల విగ్రహాలను ఉంచి అర్చకస్వాములు పడిపూజ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందుగా గణపతిపూజ నిర్వహించారు. అనంతరం మారేడు, జమ్మి, తులసి తదితర దళాలతో దీక్షాపరులు తమ ముందున్న మండపంలో అర్చకస్వాములు సత్యదేవుడి అష్టోత్తర సహస్రనామాలు పఠించంగా మంత్రాలకుణుగుణంగా దీక్షాపరులు పూజలు గావించారు. భక్తిపాటలను దీక్షాపరులు ఆలపించారు. సుమారు 3వేలమంది అయ్యప్పస్వాములు, దీక్షాపరులు పాల్గొన్నారు. ఏ ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఏర్పాట్లు చేశారు. దీక్షాపరులందరికీ అల్పాహారాన్ని దేవస్థానం అందించింది.

నేడు సత్యదీక్షల విరమణ

అత్యంత నియమనిష్టలతో 27 రోజులు, 18 రోజులు, 9రోజుల సత్యదీక్షలు స్వీకరించిన సత్యదీక్షాపరులు గురువారం సత్యదీక్షలు విరమింపచేయనున్నారు. దూరప్రాంతాల నుంచి విచ్చేసిన కొందరు దీక్షాపరులు ఇరుముడులతో బుధవారం రాత్రికి ఆలయ ప్రాంగణానికి చేరుకోగా మరికొందరు వేకువజామున శిరస్సున ఇరుముడిధ రించి విచ్చేశారు. సత్యదీక్షాపరుల ఇరుముడులు పురస్కరించుకుని వార్షిక కల్యాణవేదిక వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీక్షావిరమణ అనంతరం వారందరికీ ఉచిత సామూహిక సత్యదేవుడి వ్రతాలను నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా

- పట్టుకున్న కాకినాడ జిల్లా పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- 213.28 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుకున్న గంజాయితో కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్, పోలీసు అధికారులు

కాకినాడ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను కాకినాడ జిల్లా పోలీసులు పట్టుకుని వారి నుంచి రూ.16,71,400 విలువైన 213.28 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. లేలాండ్ గూడ్స్ వాహనం, స్మార్ట్ ఫోన్‌ను సీజ్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ జి.బిందుమాధవ్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎన్‌హెచ్- 16 హైవేపై గంజాయి రవాణా జరుగుతుందని ఎస్పీకి వచ్చిన పక్కా సమాచారంతో ఆయన ఆదేశాల మేరకు పెద్దాపురం ఎస్ డీపీవో శ్రీహరిరాజు పర్యవేక్షణలో జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తన బృందంతో రామవరం, రంగవల్లి నగర్ వద్ద వాహన తనిఖీలు చేప ట్టారు. విశాఖపట్నం వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న అశోక్ లీలాండ్ గూడ్స్ వాహనాన్ని ఆపి పారిపోతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సరుకు, వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ముజాఫర్నగర్ జిల్లా కటౌలి మండలం ఖోకాని గ్రామానికి చెందిన 36 ఏళ్ల మహ్మద్ షాహిద్, అదే ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల రోహిత్ శర్మగా గుర్తించారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐ టి.రఘునందనరావు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

చోరీ కేసులో 624 గ్రాముల బంగారం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

కాకినాడ క్రైం: ఓ దాబా వద్ద ఆగి ఉన్న బస్సులో ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్‌ను తెరచి అందులోని సుమారు రూ.60 లక్షల విలువైన 624 గ్రాముల బంగారాన్ని ఆగంతుకులు ఈ ఏడాది సెప్టెంబరు 10న తస్కరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ కేసు నమోదు చేసి 3 బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా గండేపల్లి మండలంలో ముగ్గురు అనుమానాస్పదంగా సంచరిస్తుండడాన్ని గమనించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా విజయనగరానికి చెందిన పాతనేరస్తులు టి.నరసింహ, పి.తేజ, మహేందర్‌గా గుర్తించారు. వారు చేసిన నేరాన్ని అంగీకరించినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ వెల్లడించారు. నిందితుల నుంచి రూ.60 లక్షల విలువైన 5 జతల బంగారు గాజులు, 44 జతలు చెవిలీలు మెత్తం 624 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఎస్‌బీ డీఎస్పీ కెవి సత్యనారాయణ, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో

ఉమ్మడి జిల్లా జట్టుకు స్వర్ణ పతకం



స్వర్ణ పతకం సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీ హరీష్‌బాలయోగి

అమలాపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సెపక్‌తక్రా పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో స్వర్ణ పతకం సాధించిందని అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు తెలిపారు. రాష్ట్రస్థాయిలో మన జిల్లాకు తొలిసారిగా స్వర్ణ పతకం సపక్‌తక్రా కీడలో లభించిందన్నారు. ప్రథమస్థానం సాధించిన క్రీడాకారుల బృందంతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం క్యాంపు కార్యాలయంలో ఎంపీ గంటి హరీష్‌బాలయోగిని కలుసుకున్నారు. సత్తాచాటిన బాల క్రీడాకారులను ఎంపీ ప్రత్యేకంగా అభినందించి జాతీయస్థాయిలోను రాణించే విధంగా శిక్షణ పొందాలని సూచించారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. త్వరలో రాష్ట్రస్థాయి సపక్‌తక్రా పోటీలు అమలాపురం కేంద్రంగా నిర్వహించేందుకు ప్రణాళికలు తయారుచేసి ఇవ్వాలని సీనియర్ కోచ్ యాండ్ర గౌతమ్‌కు సూచించారు. క్రీడాకారులతో పాటు శిక్షణ ఇచ్చిన కోచ్ కేతా సతీష్, ఫిజికల్ డైరెక్టర్ బూల చిరంజీవి, టీమ్ మేనేజర్ జీవీ బాబులను ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, పేరూరి వెంకటేశ్వరరావు, అప్పారి మోహనరావు పాల్గొన్నారు.

బాలింత మృతి వ్యవహారంలో వైద్యురాలిపై చర్యలు

- డీసీహెచ్ఎస్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు

పిఠాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలింత మృతి వ్యవహారంలో వైద్యురాలి(గైనకాలజిస్టు)పై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఆమెను కాకినాడ జిల్లా పిఠాపురం ఆసుపత్రి నుంచి రిలీవ్ చేసి తూర్పుగోదావరి జిల్లాలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యాలయానికి అటాచ్‌చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అసలేం జరిగిందంటే..?

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన దొండపాటి శ్రీదుర్గ అక్టోబరు 13న పిఠాపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం(ప్రభుత్వాసుపత్రి)లో చేరి 14న బిడ్డను ప్రసవించింది. అనంతరం అధిక రక్తస్రావమై సీరియస్ కావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా శ్రీదుర్గ అక్కడ మరణించగా బిడ్డ అనారోగ్యానికి గురైంది. దీనిపై మృతురాలి బంధువులు ఆందోళన నిర్వహించారు. హైరిస్క్ కేస్ అని తెలిసినా చికిత్స డెలివరీ సమయంలో ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ పి.సుజాత నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, గైనిక్ హెచ్‌వోడి డాక్టర్ అనురాగమయి, పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ మాణిక్యం, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి, జీజీహెచ్ ఏవో శేషేంద్రశర్మ పిఠాపురంలో విచారణ నిర్వహించారు. మృతురాలి బంధువులు, చికిత్స చేసిన వైద్యులు, సిబ్బంది.. ఆ రోజు విధుల్లో ఉన్న పారా మెడికల్ స్టాఫ్ నుంచి వివరాలు సేకరించారు. మృతురాలి కేస్ షీటు, బిడ్డ ఆరోగ్యం తదితర అంశాలను పరిశీలించి జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు నివేదిక సమర్పించారు. నివేదిక ఆధారంగా దొండపాటి శ్రీదుర్గకు వైద్యం చేసిన గైనకాలజిస్టు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతను తక్షణం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీహెచ్ఎస్ కార్యాలయానికి ఏటాచ్ చేయాలని కలెక్టర్ సూచించారు. దీంతో ఆమెను పిఠాపురం సీహెచ్‌సీ నుంచి రిలీవ్ చేసి డీసీహెచ్ఎస్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉమ్మడి జిల్లా ఆసుపత్రి సేవల కోఆర్డినేటర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సుజాతను డీసీహెచ్ఎస్ కార్యాలయానికి ఎటాచ్ చేసిన నేపథ్యంలో వైద్యసేవలకు ఇబ్బంది లేకుండా సామర్లకోట ప్రభుత్వాసుపత్రి నుంచి డాక్టర్ కన్యాకుమారిని పిఠాపురం సీహెచ్‌సీ నుంచి డిప్యూటేషన్‌పై నియమించారు. ఆమె విధులకు హాజరయ్యారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

- మరో ఇద్దరికి గాయాలు



మృతిచెందిన శివకృష్ణ

చింతూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. చింతూరు ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం దుమ్ముగూడెం మండలం చెరుపల్లికి చెందిన శివకృష్ణతో పాటు మరో ఇద్దరు ద్విచక్రవాహనంపై మంగళవారం రాత్రి చింతూరు - విజయవాడ జాతీయ రహదారి నంబరు 31 మీదుగా భద్రాచలం వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో అల్లూరి జిల్లా చింతూరు మండ లం తుమ్మల సమీపంలో అటుగా కాలినడకన వెళ్తున్న వ్యక్తిని శివకృష్ణ ద్విచక్ర వాహనంతో ఢీ కొన్నాడు. దీంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి పడిపోయింది. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న శివకృష్ణ (31) తలకు తీవ్రంగా గాయమై మృతి చెందాడు. ఇక కాలినడకన వెళ్తున్న వ్యక్తితో సహా వాహనంపై వెళ్తున్న మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వారి పరిస్థితి నిలకడగా ఉందని, కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి



వెంకటరమణ (ఫైల్)

కొవ్వూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యి ప్రాంతానికి చెందిన దేవగుప్తాపు వెంకటరమణ (52) బుధవారం మరోవ్యక్తి కలిసి మోటారుసైకిల్‌పై పోలవరం వైపు వెళ్తున్నారు. వారిని కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. వెంకటరమణ కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అత్యవసర వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమార్తె మానేపల్లి సాయిశ్రీ అందించిన ఫిర్యాదుతో కేసునమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. వెనుక కూర్చున వ్యక్తికి ఏ గాయాలు కాలేదన్నారు.

లారీని ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు

గండేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. స్థానికుల సమాచారం ప్రకారం.. జగ్గంపేట వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు గండేపల్లి వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీ ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

యువకుడికి తీవ్రగాయాలు

గండేపల్లి మండల యల్లమిల్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కె.నాయకంపల్లి నుంచి యల్లమిల్లి వెళ్తున్న పాల వ్యాను ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొనడంతో మోటారుసైకిల్‌పై ఉన్న యల్లమిల్లికి చెందిన మామిడిపాక ఈశ్వర్‌కల్యాణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో రాజమండ్రి తరలించారు.

మిఠాయి కొనొచ్చేలోపు మోటారుసైకిల్ డిక్కీలోని

రూ.5 లక్షల దొంగతనం

అల్లవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోడూరుపాడు సెంటర్ వద్ద మంగళవారం మోటారు సైకిల్ డిక్కీలో ఉంచిన రూ.5లక్షల నగదు చోరీకి గురైంది. పోలీసుల కథనం ప్రకారం.. అల్లవరం మండలం గూడాల గ్రామానికి చెందిన మోకా వెంకటేశ్వరరావు-సత్యవతి దంపతులు అమలాపురం బ్యాంకులో రూ.5లక్షల నగదు డ్రా చేసుకుని మోటారుసైకిల్ డిక్కీలో ఉంచారు. కోడూరుపాడు సెంటర్‌లో మిఠాయి కొట్టు వద్ద ఆగి మిఠాయి కొనుగోలు చేశారు. తర్వాత చూస్తే మోటారుసైకిల్ తాళం కనిపించకపోవడంతో వెంకటేశ్వరరావు ఇంటి వద్ద నుంచి మరో తాళాన్ని తెప్పించి మోటారుసైకిల్ డిక్కీ తెరవగా డిక్కీలో ఉంచిన రూ.5లక్షల నగదు, సెల్‌ఫోన్ మాయమైనట్టు గుర్తించి అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేశామని, రెండు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టినట్టు ఎస్ఐ బి.సంపత్‌కుమార్ తెలిపారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

- ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్‌ను సందర్శించిన విద్యుత్ సౌదా హైడల్ డైరెక్టర్



పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో పర్యటిస్తున్న హైడల్ డైరెక్టర్, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్, సిబ్బంది

మోతుగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్‌లో బుధవారం విజ యవాడ విద్యుత్ సౌదా హైడల్ డైరెక్టర్, ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఫైనాన్స్ సృజయ్ కుమార్ పర్యటించారు. కాంప్లెక్స్‌లోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. ఏపీ జెన్కో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 230మెగావాట్ల 5,6 యూనిట్ల జల విద్యుత్ కేంద్రం పనులను పరిశీలించారు. 5,6 యూనిట్ల పనులకు సంబంధించి ఓవల్ ఆఫీస్ బటర్లై వాల్ నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. అలాగే 5, 6 యూనిట్ల పెన్‌స్టాక్ పైప్లైన్ పనులను పరిశీలించారు. సివి ల్ పనుల ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణని అడిగి తెలుసుకున్నారు. 5,6 యూనిట్లకు సంబంధించి సివిల్, మెకానికల్ పనులు సంతృప్తికరంగా జరుగుతున్నాయన్నారు. సాధ్య మైనంత త్వరగా 5,6 యూనిట్ల పనులను పూర్తి చేస్తే ఇప్పుడున్న 460 మెగావాట్ల విద్యుత్తు ఉత్ప త్తికి తోడు మరో 230 మెగావాట్లు తోడై మొత్తంగా 690 మెగావాట్ల ఉత్పత్తి ఈ జల విద్యుత్ కేంద్రం నుంచి ఉత్పత్తవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎత్తిపోతల పనులకు సంబంధించి అప్పర్ సీలేరు జలవిద్యుత్ కేంద్రానికి బయలుదేరారు. కార్యక్రమంలో విజయవాడ హైడల్ సివిల్ సీఈ పి.రవీందర్‌రెడ్డి, టీయూఎన్ శ్రీనివాస్, ఎస్సీ హైడల్ ఎం.విజయవాడ సివిల్ హైడల్ ఎస్సీ శ్రీనివాసరెడ్డి, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వెంకట రాజారావు, ఎస్సీ చిన్నకామేశ్వర రావు, టెక్నికల్ డీఈ వరప్రసాద్, సివిల్ ఎస్సీ చం ద్రశేఖర్ రెడ్డి, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగ శ్రీనివాస్, సీనియర్ ఎకౌంటు ఆఫీసర్ వర ప్రసాద్ సివిల్, ఏడీఈలు కొండబాబు, నరసింహులు అసిస్టెంట్ ఇంజనీర్లు పవన్ విజయ్ ఉన్నారు.

అవిశ్వాస తీర్మాన సమావేశం రద్దు

- సామర్లకోటలో మున్సిపల్ కౌన్సిలర్ల అసహనం

సామర్లకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణపై సొంత పార్టీకి చెందిన 24 మంది వైసీపీ కౌన్సిలర్లు రెండోదఫా పెట్టిన అవిశ్వాస తీర్మాన సమావేశం హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం రద్దు చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య కౌన్సిల్‌హాలులో సమావేశాన్ని రద్దు చేసినట్టు ప్రకటించి తిరిగి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ముందుగా ఇచ్చిన నోటీసుల మేరకు వైసీపీకి చెందిన 24 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. సదరు సమావేశానికి హాజరుకావాల్సిన ప్రత్యేకాధికారి, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు హాజరుకాకపోవడంతో హైకోర్టు ఆదేశాలను ఆర్డీవో ద్వారా కమిషనర్ తెలుసుకుని కౌన్సిలర్లకు సదరు సమావేశం రద్దయినట్టు తెలియజేశారు. దీంతో కౌన్సిలర్లు తీవ్ర అసహనానికి గురయ్యారు. మెజార్టీ సభ్యులు సమావేశానికి హాజరైనట్టు గుర్తించి తమకు ఆర్డీవో నుంచి లేఖలు ఇస్తే తాము సమావేశం నుంచి వెళ్లిపోతామని స్పష్టంచేశారు. దీంతో కమిషనర్ కాకినాడలో ఉన్న ఆర్డీవో మల్లిబాబుతో ఫోన్ ద్వారా చర్చించి ఆర్డీవో సంతకంతో కూడిన లేఖలను హాజరైన కౌన్సిలర్లకు అందజేశారు. దీంతో పరిస్థితి తాత్కాలికంగా సద్దుమణిగింది.

'ఏలేరు'లో తగ్గిన నీటి నిల్వలు

ఏలేశ్వరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా తగ్గాయి. బుధవారం ఎగువ ప్రాంతం నుంచి 1175 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. కాగా 85.53 మీటర్ల స్థాయిలో 22.02 టీఎంసీలు ఉన్నట్టు అధికారులు తెలిపారు.

16న కుమ్మరి శాలివాహన వనసమారాధన

అంబాజీపేట,నవంబరు12(ఆంధ్రజ్యోతి): మాచ వరం కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘ భవనంలో ఈనెల16న కోనసీమ కుమ్మరి శాలివాహన కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం, దాలిపర్తి భీమేశ్వరరావు తెలిపారు. 22మండలాల సంఘీయులంతా హాజరై విజయవంతం చేయాలన్నారు.

పరిశ్రమల బోర్డు డైరెక్టర్‌కు అభినందనలు

పి.గన్నవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్ అంబటి భూలక్ష్మి, కోటేశ్వరరావు దంపతులను బుధవారం సొసైటీ చైర్మన్ మట్టపర్తి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు నూలు రమేష్, యల్లమిల్లి లీలావతి, సీఈవో శేషగిరి రావులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహాలు: ఎమ్మెల్యే దేవ



గృహ లబ్ధిదారునికి తాళం, స్వీట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



ముమ్మిడివరం: చెయ్యేరుగున్నేపల్లిలో గృహప్రవేశాల కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

మలికిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అర్హులందరికీ గృహాలు ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. పీఎంఏవై పథకంలో మలికిపురంలో నూతనంగా నిర్మించిన గృహాన్ని లబ్ధిదారులు నల్లి శ్రీనివాస్ దంపతులకు ఎమ్మెల్యే దేవ బుధవారం అందజేశారు. ఎమ్మెల్యే గృహాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు ఇంటితాళం, స్వీట్లను అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో 1057గృహప్రవేశాలు చేసినట్లు తెలిపారు. ప్రతీ లబ్ధిదారునకు ఈపథకంలో రూ.1.80లక్షల సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో మరో 2500గృహాలు మంజూరయ్యాయని, ప్రతీ కుటుంబానికి పక్కా గృహం ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి-తులసీభాస్కర్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ ఎంపీ సత్యవాణి, ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి, అడబాల యుగంధర్, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, మల్లిపూడి సత్తిబాబు, గుబ్బల ఫణి, శ్రీనివాస్, జంపన సత్యనారాయణరాజు, రావూరి నాగు, సర్పంచ్ రాపాక ఆనంద్‌కుమార్, ఆరేటి శ్రీరంగ నాయకులు, చెల్లుబోయిన హెలీన, చెల్లింగి సత్యనారాయణ, చాణుక్య, రవికిరణ్, ఎంపీడీవో సీహెచ్ శ్రీలక్ష్మీకల్యాణి, హౌసింగ్ డీఈఈ జె.సత్యనారాయణ, ఏఈఈ కె.అయ్యప్పనాయుడు, బాలకృష్ణ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సొంత ఇంటి కల సాకారం

ముమ్మిడివరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇళ్ల నిర్మాణానికి రుణాలుమంజూరు చేసిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి పేర్కొన్నారు. సీహెచ్ గున్నేపల్లిలో నూతనంగా నిర్మితమైన గృహాలను ప్రారంభోత్సవం చేసి లబ్ధిదారులకు అందించారు. నాయకులు అర్థాని శ్రీనివాసరావు, గొలకోటి దొరబాబు, గుద్దటి జమి, కట్టా సత్తిబాబు, యాళ్ల ఉదయ్, గాలిదేవర బుల్లి, మిమ్మితి చిరంజీవి, గొల్లపల్లి ధర్మారావు, చింతలపూడి కొండబాబు, దంగేటి శ్రీను, పంచాయతీ కార్యదర్శి ఇందుమతి, హౌసింగ్ డీఈ రఘురామ్‌కుమార్, ఏఈ కేవీఎస్వీ దొరబాబు, వర్క్ ఇనస్పెక్టర్ శాంతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోతవరంలో గృహ ప్రవేశాలు

పి.గన్నవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పోతవరంలో రెండు గృహప్రవేశాలు చేశారు. పులిదిండి నాగవెంకటరమణ, పిల్లి సత్యనారాయణతో హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మీలు గృహప్రవేశాలు చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.మల్లికార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో ఎం.మధుసూదనరావు, సర్పంచ్ వడలి కొండయ్య, ఇంచార్జ్ ఏఈ కె.శ్రీధర్‌రావు, రాష్ట్ర నాటక రంగ అకాడమీ డైరెక్టర్ చెల్లిబోయిన గంగాదేవి, టీడీపీ కో-కన్వీనర్ దాసరి వీరవెంకటసత్యనారాయణ, సొసైటీ చైర్మన్ మట్టపర్తి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల కార్యదర్శి గుత్తుల రామకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక: ఎమ్మెల్యే





ఎమ్మెల్యే ఆనందరావుతో పదవీప్రమాణం చేసిన మండల, క్లస్టర్, యూనిట్, గ్రామకమిటీ, బూత్ కమిటీల నాయకులు, అల్లవరం: దెందుకూరిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఉప్పలగుప్తం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గొల్లవిల్లి నిమ్మకాయల చినరాజప్ప కల్యాణ మండపంలో బుధవారం టీడీపీ మండల కార్యవర్గం, క్లస్టర్, యూనిట్, బూత్‌కమిటీల పదవీ ప్రమాణస్వీకారోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రెండో సారి పార్టీ మండలాధ్యక్షుడిగా ఎన్నికైన అరిగెల నానాజీ పార్టీకి అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. తొలుత టీడీపీ పతాకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం టీడీపీ మండలాధ్యక్షుడు, ఇతర కార్యవర్గాలతో ప్రమాణ స్వీకారం చేయించి, వారిని శాలువాలు కప్పి సన్మానించారు.టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఆక్వా స్టేట్ డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గొలకోటి చిన్నా, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, ఫిషరీష్ డైరెక్టర్ లంకే భీమరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, మద్దింశెట్టి సీతారామస్వామి, అరిగెల నరేష్, గుత్తుల నాగేశ్వరరావు, పండు వెంకటేశ్వరరావు, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, ఆకుల వెంకటరమణ పాల్గొన్నారు.

మళ్లీ చంద్రబాబే సీఎం కావాలి

అల్లవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పరిపాలనా దక్షతతో ఆంధ్ర రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబే 2029 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా రావాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అల్లవరం బసవా మంగాయమ్మ కమ్యూనిటీ భవనంలో బుధవారం జరిగిన టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలుగుదేశం పార్టీని గ్రామస్థాయి నుంచి నూతన కమిటీలు బలోపేతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రెండోసారి టీడీపీ మండలాధ్యక్షుడిగా దెందుకూరి సత్తిబాబురాజు ఎన్నికయ్యారు. సెక్రటరీగా పశ్చిమాల ఏడుకొండలు, ఉపాధ్యక్షుడిగా కొపనాతి తాతాజీ, కార్యనిర్వాహక కార్యదర్శిగా పోతుల నాగలక్ష్మిలను ఎన్నుకున్నారు. క్లస్టర్ ఇన్‌చార్జిలుగా కడలి వెంకటేశ్వరరావు, వేగిరాజు వెంకట్రాజు, బండిగుప్తావు సత్తిబాబు, మండల మహిళా అధ్యక్షురాలిగా కాంద్రేగుల వాణీఅచ్యుతం, సెక్రటరీగా గుర్రం శారద, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా బళ్ల సత్యనారాయణ, బీసీసెల్‌అధ్యక్షుడిగా రాయుడు రాంబాబు, తెలుగు యువత మండల అధ్యక్షుడిగా ముత్యాల బాబి, రైతు అధ్యక్షుడిగా గోసంగి స్టాలిన్, వాణిజ్యసెల్ అధ్యక్షుడిగా గుమ్మడి సూర్యచంద్రరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జిలతో పాటు మండల కమిటీలను ఎమ్మెల్యే ఆనందరావు అభినందించారు. నియోజకవర్గ అబ్జర్వర్ పెచ్చెట్టి బాబు, డీసీ చైర్మన్ దాట్ల గోపీరాజు, నడింపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.

కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

ముమ్మిడివరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నియోజకవర్గంలోని మండల క్లస్టర్, యూనిట్, గ్రామ, టౌన్, బూత్ స్థాయిల్లో పార్టీ నూతనంగా నియమితులైన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం గురువారం జరగనున్నట్టు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెంలోని శ్రీపద్మావతి వేంకటేశ్వర కల్యాణ మండపంలో మధ్యాహ్నం 2గంటలకు నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి తరలిరావాలని ఆయన సూచించారు.

టీడీపీ కార్యక్రమాలు వేగవంతం చేయాలి



పి.గన్నవరంలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రెడ్డి అనంతకుమారి

పి.గన్నవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో టీడీపీ కార్యాలయం ప్రారంభంతో నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు వేగవంతం చేయాలని బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి అన్నారు. పి.గన్నవరంలో టీడీపీ నియోజకవర్గ స్థాయి నూతన కార్యాల యాన్ని ఆమె ప్రారంభించారు. ఈకార్యక్రమా నికి టీడీపీ రాష్ట్ర రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనంద సాగర్ అధ్యక్షత వహించగా ఆమె మాట్లాడారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతీ శుక్రవా రం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమం పి.గన్నవరంలో నిర్వహిస్తారని, కార్యకర్తల సమస్యలను అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. త్వరలో నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్టీ మండల అధ్యక్షుడి నియామకాలు జరుగుతాయన్నారు. పార్టీ కార్యాలయం నిర్వహణకు పలువురు నాయకులు విరాళాలు ప్రకటించారు. అనంతరం కార్తీక వనసమారాధన జరిగింది. కాగా ఈకార్యక్రమానికి నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబుతో పాటు పలువురు నాయకులు గైర్హాజరయ్యారు. దాసరి వీరవెంకటసత్యనారాయణ, చెల్లిబోయిన గంగాదేవి, అంబటి భూలక్ష్మి, మట్టపర్తి భారతి, చిట్టూరి శ్రీనివాస్, మట్టపర్తి రామకృష్ణ, చొల్లంగి సత్యనారాయణమూర్తి, మద్దాల సుబ్రహ్మణ్యం, మోల్లేటి శ్రీను, బోణం బాబు, బొండాడ నాగమణి, పత్తిపాటి ఉమామహేశ్వరి, కె.సత్యనారా యణరాజు, శేరు శ్రీనుబాబు, ఆరుమిల్లి సాయిబాబు, నక్కా సత్యనారాయణ, పులపర్తి సుజాత పాల్గొన్నారు.

రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

యానాం,నవంబరు12(ఆంధ్రజ్యోతి): రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని యానాం బ్లాక్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు మాజేటి సత్యభాస్ వెంకటేశ్వర్ కోరారు. ఈమేరకు పుదుచ్చేరి వ్యవసాయశాఖ కార్యదర్శి, వాణిజ్యపన్నుల శాఖ కమిషనర్ సీహెచ్.మొహమ్మద్ యాసిన్ కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఎరువులు, పెస్టిసైడ్స్, వ్యాపార లైసెన్స్‌లజారీలో జాప్యం, వాణిజ్య పంటల నిల్వ కోసం గోదాముల నిర్మాణం తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం ఎఫ్‌పీవో అధ్యక్షుడు, పుదుచ్చేరి వ్యవసాయశాఖ డైరెక్టర్ జయశంకర్, డిప్యూటీ డైరెక్టర్ శివ సుబ్రహ్మణ్యంను తదితర అధికారులను కలిసి రైతుల అభ్యున్నతికి సహకరించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరాలతో ప్రయోజనం

మామిడికుదురు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాల వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని నగరం సర్పంచ్ జాలెం రమణ కుమారి పేర్కొన్నారు. నగరం గ్రామ పంచాయతీ వద్ద బుధవారం కపిలేశ్వరపురం ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. 70మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 20మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి ఈనెల20న ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు జాలెం సుబ్బారావు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యుడు ముఖ్రం హుస్సేన్, పంచాయతీ సెక్రటరీ కూనపరెడ్డి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా చెరువుల వద్ద పరిశుభ్రతపై అవగాహన



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపెడ-నక్నా ఫీల్డ్‌మేనేజర్ సునీల్‌కుమార్

అంతర్వేది, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పరిసర ప్రాంతాల్లో రొయ్యల చెరువుల వద్ద పరిశుభ్రతపై రైతులకు ఎంపెడ-నక్నా ఫీల్డు మేనేజర్ పి.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛత పక్వాడ-2025లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రాంతమైన అంతర్వేది తీరప్రాంత గ్రామాల్లో ఆక్వాసాగుపై రైతులు ఎక్కువ శాతం ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. చెరువులు వద్ద వాడే మందులు, మేత తదితరాలతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రంచేస్తూ పరిసరాలను బాగు చేసుకోవాలని సునీల్ రైతులకు సూచించారు. ఆక్వాచెరువుల వద్ద పరిశుభ్రత కార్యక్రమం అనంతరం రైతులకు మొక్కలను సునీల్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తీర ప్రాంత ఆక్వారైతులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల హౌస్ అరెస్టు



అంబాజీపేట: పోలీసులతో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

అంబాజీపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ బుధవారం వైసీపీ నాయకులు నిరసన చేపడుతున్న నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామునే పోలీసులు ఆరుగురు నాయకులను హౌస్ అరెస్టు చేశారు. వైసీపీ మండల అధ్యక్షుడు విత్తనాల శేఖర్ ఇంటి వద్ద నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకుని నిరసన తెలిపేందుకు ప్రయత్నించారు. దీంతో సీఐ ఆర్.భీమారాజు ఆధ్వర్యంలో ఎస్ఐ చిరంజీవి, పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో వైసీపీ నాయకులు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని వైసీపీ నాయకులు పట్టుబట్టడంతో సీఐ భీమరాజు వారితో చర్చించారు. సీఐ వైసీపీ నేతకు సర్దిచెప్పడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పీకే రావు, పేరి శ్రీను, కోట బేబీరాణి, ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో పి.గన్నవరం, రాజోలు సీఐలు ఆర్.భీమరాజు, నరేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పి.గన్నవరం,(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పి.గన్నవరంలో బుధవారం వైసీపీ నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. పి.గన్నవరంలో వైసీపీ అధ్యక్షుడు మండల యన్నాబత్తుల ఆనంద్, నాయకులు మందపాటి కిరణ్ కుమార్, దాసరి కాశి, జల్లి పండులను హౌస్ అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసీపీ తలపెట్టిన ప్రజా ఉద్యమ ర్యాలీని పురస్కరించుకుని వైసీపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. మామిడికుదురు మండలానికి చెందిన జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, ఎంపీటీసీ సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, తోరం భాస్కర్, నెల్లి దుర్గాప్రసాద్, మండలశాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పలువురు నాయకులను పోలీసులు గృహనిర్బంధంలోకి తీసుకున్నారు. వైసీపీ తలపెట్టిన ర్యాలీలో ఏవిధమైన అలజడులు సృష్టించకుండా ఉండేందుకు ఆయా నాయకులను గృహనిర్బంధంలోకి తీసుకున్నట్టు ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు వైస్‌కెప్టెన్ అజిత్



అజిత్‌ను అభినందిస్తున్న భరత్ తదితరులు

అమలాపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా క్రీడా పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో స్వర్ణ పతకం సాధించింది. జట్టు తరపున అమలాపురం శ్రీవాగ్దేవి పాఠశాల విద్యార్థి బండారు శ్రీవెంకటఅజిత్‌చంటి ప్రతిభ చాటాడు. రాష్ట్ర జట్టుకు వైస్‌కెప్టెన్‌గా అజిత్‌ను ఎంపిక చేశారు. ఈసందర్భంగా అజిత్‌తో పాటు తల్లిదండ్రులు బండారు వెంకటరెడ్డినాయుడు, సత్యరాణిలను పాఠశాల డైరెక్టర్ పరసా భరత్, ప్రిన్సిపాల్ ఎస్.శ్రీరామచంద్రమూర్తి, హెచ్ఎం పిచ్చిక సుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు.

విద్యార్థులకు పురస్కారాలు

మామిడికుదురు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరంలో 5నుంచి పదో తరగతి వరకు పెదపట్నంలంక జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు శరత్‌చంద్ర ఫౌండేషన్‌వారు ప్రతిభా పురస్కారాలను బుధవారం అందించారు. పెదపట్నంలంక జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పీఎస్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ ఏవో కొమ్ముల రాణి మాట్లాడారు.13మంది విద్యార్థులకు 24వేలు విలువైన ప్రోత్సాహక బహుమతులు అందించారు. పదో తరగతిలో 557 మార్కులు సాధించిన ముత్యాల సత్యశ్రీవల్లీని అభినందించారు.ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై వైసీపీ నిరసన

అమలాపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ శాంతియుతంగా నిర్వహించారు. అమలాపురం నల్లవంతెన వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు స్వస్తి పలికి ప్రభుత్వమే వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టాలని నినాదాలు చేశారు. ఈమేరకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణ, మాజీఎంపీ చింతా అనురాధ, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మిబాబు, యిళ్ల శేషారావు, కుడుపూడి భరత్‌భూషణ్, దాసరి అరుణ, పందిరి శ్రీహరి, పొగాకు శ్రీను, ఉండ్రు వెంకటేష్, సూదా గణపతి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం,(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలు, ప్రభుత్వాసుపత్రులను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం ముమ్మిడివరంలో నిరసన చేపట్టారు. నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి తరలివెళ్లి ఎంపీడీవో దీక్షితులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పితాని బాలకృష్ణ, కమిడి ప్రవీణ్‌కుమార్, కాశి బాలమునికుమారి, జగతా బాబ్జి, కాదా గోవిందు, పెయ్యల చిట్టిబాబు, కుడుపూడి శంకరరావు, కోలా బాబ్జి, బొంతు బుజ్జిబాబు, రాయపురెడ్డి జానకిరామయ్య, వల్లభుని దొరబాబు, నేల కిశోర్, పిన్నమరాజు శ్రీనురాజు, నల్లా నరసింహమూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై తిరిగేవారి వివరాలు తెలపండి

అమలాపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మానసిక అనారోగ్యంతో బాధపడుతూ ఆదరించే వారు లేక రోడ్లపై తిరిగే నిరాశ్రయుల కోసం మనోబంధు ఫౌండేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల14న అమలాపురంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. రోడ్లపై తిరిగేవారిని విశాఖపట్నంలోని మానసిక రోగుల ఆసుపత్రిలో చేర్పించి వైద్యసేవలు, వసతి, ఆహారం అందజేస్తారని కమిషనర్ తెలిపారు. పురపాలక సంఘ పరిధిలో ఎక్కడైనా మతిస్థిమితం లేని, రోడ్లపై తిరిగే వ్యక్తులు కనిపిస్తే సెల్ 8978887145కు సమాచారం ఇవ్వాలని కమిషనర్ కోరారు.

చెత్త సమస్యపై కోర్టును ఆశ్రయించిన గ్రామస్తులు

ముమ్మిడివరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతంలో ఉన్న డంపింగ్ యార్డును అక్కడి నుంచి తొలగించి పర్యావరణ కాలుష్యం నుంచి తమకు రక్షణ కల్పించాలని కొత్తలంక గ్రామానికి చెందిన నడిమింటి సూర్యప్రభాకరం, మాజీ సర్పంచ్ దాసరి సుమలత, పలివెల నాగరాజు, తోలేటి రాంబాబు 2024 డిసెంబరులో హైకోర్టును ఆశ్రయించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని చెత్తనంతటినీ ముమ్మిడివరం-కొత్తలంక రోడ్డు పక్కన ఆనుకుని డంపింగ్ యార్డులో వేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఆ చెత్త రోడ్డుపైకి వచ్చి అటువైపు వెళ్లేవారికి దుర్గంధం వెదజల్లడంతో ప్రయాణికులు, బాటసారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీంతో హైకోర్టు న్యాయమూర్తి ప్రజల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు.

'విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం సీఎస్‌తో మాట్లాడా'

మలికిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో ఓల్టేజ్ సమస్యల పరిష్కారానికి శంకరగుప్తంలో 132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో మాట్లాడినట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. 2000లో శివకోడులో 132/33 కేవీ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు మరో విద్యుత్ కేంద్రం కోసం ఎవరూ ప్రయత్నించలేదన్నారు. దీనికి రూ.80కోట్లు బడ్జెట్ కావాలని, ప్రధాన కార్యదర్శి అంగీకారం తెలిపారని ఎమ్మెల్యే అన్నారు. తీర ప్రాంతంలో లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి శంకరగుప్తంలో విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు హామీ ఇచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జనవనరులశాఖ సలహాదారులు వెంకటేశ్వరరావుతో శంకరగుప్తం డ్రెయిన్ ముంపు సమస్య కోసం ప్రస్తావించగా ఎనిమిది కిలోమీటర్ల మేర డ్రెడ్జింగ్, 14.5కిలోమీటర్ల మేర గట్లు ఎత్తు చేయడానికి రూ.20.62కోట్లతో ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారని అన్నారు. నియోజకవర్గంలో ఉప్పునీటి సమస్య, ముంపు సమస్య తొలగడానికి కరవాక వద్ద డీఎల్ఆర్బీ(డబుల్‌లైన్ రోడ్ కం రెగ్యులేటర్) ఏర్పాటుకు అడిగానని, దీనికి రూ.30కోట్లు ఖర్చు అవుతుందని, కరవాకలో దీన్ని నిర్మిస్తే రాజోలు నియోజకవర్గం చాలావరకు బతికి బట్టకడుతుందన్నారు. ప్రతిపాదనలు సిద్ధంచేసి సంబంధిత అధికారులకు అందించానన్నారు. రూ.13కోట్లతో సెంట్రల్‌డెల్టా, ఈస్ట్రన్ డెల్టాలో సర్వే చేయనున్నారని, తద్వారా ముంపు ప్రాంతాలను గుర్తించి తగు ప్రణాళికలు సిద్ధం చేయడానికి అవకాశం ఏర్పడుతుందని ఆయన చెప్పారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, అడబాల యుగంధర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వనసమారాధన



వన సమారాధనలో పాల్గొన్న మల్లాడి

యానాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): యానాం ఎలక్ట్రిషియన్ రీవైండింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. స్థానిక రాజీవ్‌గాంధీ బీచ్ కొబ్బరితోటలో ఉసిరి చెట్టు వద్ద కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరయ్యారు. అందరూ ఐక్యమత్యంగా ఉండాలని, అసోసియేషన్ అభివృద్ధికి తన సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. అనంతరం వారితో కలిసి మల్లాడి భోజనం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నమండ దేవేంద్రవర్మ, కోశాధికారి కముజు బాలమురళీకృష్ణ తదితర సభ్యులు పాల్గొన్నారు.

నేడు గ్రామశాఖల ప్రమాణ స్వీకారాలు

మలికిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలోని ఎంపికైన గ్రామశాఖల వివిధ విభాగాలకు చెందిన సంస్థాగత కమిటీల ప్రమాణ స్వీకారం గురువారం లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో జరుగుతుందని టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్యా తెలిపారు. బుధవారం లక్కవరంలో జరిగిన సమావేశంలో అమూల్యా మాటాడారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, అడబాల యుగంధర్, రాపాక నవరత్నం, ముప్పర్తి నాని, తాడి సత్యనారాయణ, వర్ధినీడి బాబ్జి, గెడ్డం సింహ, కాకి లక్ష్మణ్, మంగెన నాని పాల్గొన్నారు.

'గురుకులం సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా'



విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న శ్రీనివాసరాజా, రజిని

పి.గన్నవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురం గురుకుల పాఠశాలకు కావల్సిన వసతులు, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు జాలెం శ్రీనివాసరాజా, పుణ్యవతుల రజిని అన్నారు. గురుకులం పాఠశాలను బుధవారం వారు సందర్శించి అనంతరం మాట్లాడారు. దీర్ఘకాలికంగా ఉన్న ఆటస్థలం సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. అనంతరం వంటగది, మరుగుదొడ్లు, ఆట స్థలాలు పరిశీలించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి వారు భోజనం చేశారు.

రాజోలులో ఇంటింటా అంబేడ్కర్ కార్యక్రమం

రాజోలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దళితుల ఆలోచనలో మార్పు రానంత వరకు అంబేడ్కర్ కలలు కన్న నిమ్నజాతులకు రాజ్యాధికారం అనేది అందని ద్రాక్షగానే మిగిలిపోతుందని దళిత చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జి అన్నారు. రాజోలులో దళిత చైతన్యవేదిక ఆధ్వర్యంలో బొడ్డపల్లి ప్రసాద్ సారథ్యంలో దళిత నాయకులు బుధవారం ఇంటింటా అంబేడ్కర్ కార్యక్రమాన్ని నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి విప్పర్తి సాయిబాబు, దేవ రాజేంద్రప్రసాద్ పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్, వైస్‌ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, దీపాటి శివప్రసాద్, మట్టా సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు హామీ

అమలాపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నవరప్పాలెం గ్రామంలో ఎస్సీ, బీసీ ఏరియాల్లో విద్యుత్ స్తంభాలు వేయకపోవడంతో మహిళలు, విద్యార్థినులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జనసేన మండలశాఖ అధ్యక్షుడు లింగోలు పండు, అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పరమట చిట్టిబాబు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగిని కలిసి వినతిపత్రం అందజేశారు. మైనరు పంచాయతీ కావడంతో దశాబ్దాల కాలంగా మౌలిక సదుపాయాలు కల్పించలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ఎంపీ నిధుల నుంచి సమస్యలు పరిష్కరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధిలో ప్రథమ స్థానం

అమలాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రముఖ పాఠశాలల ర్యాంకింగ్ సంస్థల్లో ఒకటైన ఐసీఎస్ఈవిభాగంలో కామనగరువులోని పరంజ్యోతి స్కూలు ప్రథమస్థానంలో నిలిచింది. విద్యార్థులకు సమగ్ర అభివృద్ధిని అందించడం ద్వారా పాఠశాల ఈర్యాంకును సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్‌విల్‌ఫ్రెడ్ తెలిపారు. దీనికికృషిచేసిన ప్రతీఒక్కర్ని పరంజ్యోతి ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌కార్యదర్శి కార్లడేవిడ్ కొమానపల్లిఅభినందించారు.

'వైసీపీ కార్యక్రమాలు అడ్డుకుంటాం'

అంబాజీపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త గన్నవరపు శ్రీనివాసరావు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక సెంటర్‌లో కూటమి నాయకులు నిరసన చేపట్టారు. తక్షణం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అప్పటివరకు వైసీపీ కార్యక్రమాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం శ్రీనివాసరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు అరిగెల సూరిబాబు, కుడుపూడి రాంబాబు, జనసేన మండల అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ, నాయకులు మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, రవణం రాము, నాగవరపు అన్నవరం, పళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా బోడసకుర్రు శాండ్ అండ్ క్వారీ సొసైటీ ఎన్నిక



అధ్యక్షుడిగా ఎన్నికైన దుర్గారావు

అల్లవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పోలీసు బందోబస్తు నడుమ ఉత్కంఠ పరిస్థితులతో బోడసకుర్రు శ్రీవెంకటేశ్వరా శాండ్ అండ్ క్వారీ బోట్స్‌మెన్ మత్స్యకార సొసైటీ ఎన్నికలు బుధవారం జరిగాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిగినా గంటల తరబడి జరిగిన ఓట్ల లెక్కింపుతో ఉత్కంఠ నెలకొంది. 19976లో ఏర్పడ్డ ఈమత్స్యకార సొసైటీకి మొదటిసారిగా ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు మరో ఏడుగురు డైరెక్టర్లు ఉంటారు. మొత్తం 9మంది డైరెక్టర్లకు 18మంది పోటీ పడగా 309 ఓటర్లకు 284మంది ఓటు హక్కు వినియోగించారు. ఎన్నికల అధికారిగా ఎఫ్‌డీవో పాల దేవీకనక ప్రసాద్, యోగానంద్‌ల సమక్షంలో ఎన్నికల లెక్కింపు జరిగింది. రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ బి.సంపత్‌కుమార్ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. కొప్పాడి దుర్గారావు సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. చింతా కనకరాజుపై దుర్గారావు విజయం సాధించారు.

ఎలక్ట్రికల్ అసోసియేషన్ భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

అమలాపురంరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఎలక్ట్రికల్ అసోసియేషన్ వనసమారాధన అమలాపురంలో వాసర్ల గార్డెన్స్‌లో ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగింది. రాష్ట్ర మాజీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వేముల శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో రాష్ట్ర సంఘనాయకులు షేక్ మహ్మద్‌కాశిసాహెబ్, గుండ్ల శ్రీరామచంద్రమూర్తి, బత్తిన సురేష్‌బాబు అసోసియేషన్ భవన మొదటి అంతస్తు నిర్మాణానికి రూ.1,11,116 అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గాలిదేవర వెంకరమణమూర్తి, మట్టపర్తి సత్తిబాబు, అసోసియేషన్ సభ్యులు, ఎలక్ట్రికల్ షాపుల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

క్వాలిటీ కంట్రోలర్ అధికారుల తనిఖీలు

అల్లవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గోడి, గోడిలంక గ్రామాల్లో జరుగుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పనులను రాజమహేంద్రవరం క్వాలిటీ కంట్రోలర్ అధికారులు బుధవారం పరిశీలించారు. క్వాలిటీ కాంట్రోల్ అధికారులు అహ్మద్, శాస్త్రిలు పనుల నాణ్యతను తనిఖీ చేశారు.

వ్యాఘ్రేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన

అంబాజీపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీవ్యాఘ్రేశ్వరస్వామి ఆలయంలో, ముక్కామల శ్రీరాఘవేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వందలాదిగా తరలివచ్చిన భక్తులు ఏకాదశ రుద్రులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మాచవరం పార్వతీ రాజేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజ నిర్వహించారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

అర్హులందరికీ త్వరితగతిన గృహ రుణం

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అర్హత కలిగి, సొంత స్థలం ఉన్నప్పటికీ ఇంటి రుణం ఇవ్వలేదని స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హత కలిగి సొంత స్థలం వున్న ప్రతి ఒక్కరికి ఇంటి రుణాన్ని గృహనిర్మాణ శాఖ ద్వారా అందిస్తున్నామని ఆయన అన్నారు. మండపేటలో బుధవారం సైదిల్‌పేటలో అమరపల్లి శ్రీనువాస్‌కు ప్రధానమంత్రి ఆవాస్ అర్బన్ క్రింద మంజూరైన 2.0 ఇంటికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కమిషనర్ టీవీ రంగారావు, బీజేపీ సీనియర్ నాయకుడు కె.సత్య నారాయణ, వార్డు ఇన్‌చార్జి బొడ్డు రామ కృష్ణ, గృహనిర్మాణశాఖ ఈఈ రమణ, డీఈ వెంకటరెడ్డి, ఏఈ తేజ, వంశీ, దాస్ తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో ఇంటి నిర్మాణం కోసం భూమిపూజ చేస్తున్న దృశ్యం

సర్వీసు రోడ్డు పనులు మళ్లీ మొదలు

ఆలమూరు, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): ఇటీవల భారీ వర్షాలు, తుఫాన్ల కారణంగా నిలిచిపోయిన చెముడులంక సర్వీసు రోడ్డు పనులు మళ్లీ మొదలయ్యాయి. మూడు నెలల క్రితం పనులు మొదలు పెట్టినప్పటికీ కొంతమంది నష్టపరిహారం కోసం పట్టుపడటంతో పాటు ఇటీవల భారీ వర్షాలు రావడంతో వాటి పనులు నిలిచిపోయాయి. బుధవారం నుంచి వీటి పనులు వేగవంతమయ్యాయి. మడికి నుంచి చొప్పెల్ల లాకుల వరకు అనేక షాపులు, ఇళ్లు ఉన్నాయి. వాటికి 1999లో నాలుగు లైన్ల రోడ్డు విస్తరణలోనే నష్టపరిహారం చెల్లించామని అధికారులు చెబుతున్నారు. తమ భూముల్లో ఉన్న నిర్మాణాలకు కూడా హైవే అధికారులు మార్కింగ్ ఇచ్చారని అవి చెల్లుబాటు కావని నష్టపరిహారం ఇవ్వాల్సిందేనని పట్టుపడుతున్నారు. ఈ సర్వీసు వల్ల రోడ్డును ఆనుకొని ఉన్న చెముడులంకకు అధిక నష్టం కలుగుతుంది. వారం రోజుల్లో రెవెన్యూ, నేషనల్ హైవే, పోలీసు, సర్వే విభాగాలకు సంబంధించిన అధికారులు ఇక్కడికి వచ్చి దీనిపై స్పష్టత ఇవ్వనున్నట్టు సుదర్శ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రతినిధులు చెబుతున్నారు.



మడికి వద్ద సర్వీసు రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం



శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి, ప్రజా సంఘాలు

చిన్నారి రంజిత కుటుంబానికి న్యాయం చేయాలి

రామచంద్రపురంలో ప్రజా సంఘాలు, విద్యార్థుల ర్యాలీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారి రంజిత హత్యను నిరసిస్తూ వారి కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం విద్యార్థులు శాంతియుత ర్యాలీ జరిపారు. జస్టిస్ ఫర్ రంజిత పేరుతో రాజగోపాల్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్డీవోకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాలు, విద్యార్థులు, దళిత సంఘాలు, రంజిత తల్లి సునీత, తండ్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

పంట వ్యర్థాలకు నిప్పు పెట్టొద్దు

కె.గంగవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వరి పంటను కోసిన తరువాత మిగిలిన వ్యర్థాలకు నిప్పుపెట్టవద్దని వ్యవసాయశాఖ మండల అధికారి ఏ.సద్గురుమూర్తి సూచించారు. బుధవారం అద్దంపల్లి, విలస, గంగవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. రైతులతో సమావేశమై వరి కోతల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలిపారు. పొలాల్లో వ్యర్థాలకు నిప్పు పెట్టడం వల్ల భూమిలో సూక్ష్మజీవులు నశించి భూసారం దెబ్బతింటోందని అన్నారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు దాసరి పెదకాపు, వీఏఏ భవాని, రైతులు పాల్గొన్నారు.



అద్దంపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏవో సద్గురుమూర్తి



రాయవరం వనసమారాధనలో ఉసిరిచెట్టు వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

విద్యుత్ ఉద్యోగుల కార్తీక వనసమారాధన

రాయవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాయవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం సెక్షన్ విద్యుత్ ఉద్యోగులు కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈసందర్భంగా ఏఈ సందక శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండపేట ఏడీఈ సీహెచ్ శ్రీధర్ మాట్లాడుతూ కార్తీక వనసమారాధనలు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. తొలుత సబ్ స్టేషన్ ప్రాంగణంలో ఉన్న ఉసిరి చెట్టు వద్ద శివ పార్వతులు, లక్ష్మీ నారాయణలకు పూజలు నిర్వహించిన అనంతరం కార్తీక సమారాధనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, జనసేన నాయకుడు దేవిశెట్టి చిన్ని, రామచంద్రపురం డివిజన్‌లో ఉన్న 11 సబ్‌స్టేషన్ల సెక్షన్ల ఏఈలు, విద్యుత్‌శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌పీఎం గ్రామసభ

కపిలేశ్వరపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పడమరఖండ్రికలో బుధవారం తహసీల్దార్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మేప్) లకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ జాయింట్ ఎల్‌పీఎంల విషయమై ధర ఖాస్తుకు రూ.50 చెల్లించాల్సి ఉందన్నారు. దీని గడువు డిసెంబరుతో ముగుస్తుందన్నారు. జాయింట్ ఎల్‌పీఎంలు ఉన్నట్లయితే రైతులంతా త్వరగా సబ్‌డివిజన్ చేయించుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. దీని ద్వారా రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి ప్రభుత్వ పథకాలకు అర్హత పొందవచ్చన్నారు. గ్రామసభలో తహసీల్దార్ శ్రీనివాస్, వీఆర్వో టి. సత్యనారాయణ, సర్వేయరు టి.కుమార్, సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పెద్దిరెడ్డి శేషారత్నం, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కపిలేశ్వరపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో నిర్వహించే ఎల్‌పీఎంఎస్ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను వివరించారు. ఈనెల 13న కపిలేశ్వరపురం, మాచర, తాతపూడి గ్రామ సచివాలయాల వద్ద, 14న కాలేరు, అంగర, నేలటూరు, 15న వెదురుమూడి, వడ్లమూరు, నిడసనమెట్ట గ్రామాల్లో ఈ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా లక్షబిల్వార్చన

ఆత్రేయపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వాడపల్లి అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం లక్షబిల్వార్చనను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు స్వామివారికి వేదమంత్రాలతో విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, నీరాజన మంత్ర పుష్పం, పంచగవ్యం, రుద్రాభిషేకం, హోమం, లింగార్చన, శాంతి హోమం, కల్యాణం, లక్షబిల్వార్చనను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



రావులచెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రావులచెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండపేటలోని రావులచెరువు అభివృద్ధికి అధికారులు తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మున్సిపల్ కమిషనర్ రంగారావును ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక కూటమి నేతలతో కలిసి రావులచెరువును పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కమిషనర్ టీవీ రంగారావు, జె.సూర్రారావు, అప్పన్నబాబు, ఎస్.రవి తదితరులు వున్నారు.



పారిశ్రామికవేత్త ఐఎస్ఎన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

మండపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండపేటకు చెందిన సంఘ సేవకుడు, పారిశ్రామికవేత్త ఇనపకోళ్ల సత్యనారాయణ (ఐఎస్ఎన్) మాతృ వియోగంతో బాధపడుతున్నారు. దీంతో వారి కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. ఐఎస్ఎన్ తల్లి చిత్రపటానికి నివాళులర్పించారు.



విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి కొత్తగూడెం మండలపల్లికి చెందిన గారపాటి సూర్యనారాయణ- అనురాధ దంపతులు రూ.1,00,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు.

ర్యాలీ ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అయిదు బుధవారాలు, అయిదు ప్రదక్షిణలు నిర్వహించుకున్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి అన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన గొల్లపూడి మారుతీపట్టాభిరామారావు, శైలజ దంపతులు రూ.50,116, మగటపల్లి చెందిన నామన లక్ష్మణ్ దంపతులు రూ.10,116, హైదరాబాద్‌కు వి.విక్రమ్ దంపతులు రూ.5,116 విరాళాలు సమర్పించారు. దాతలకు ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందచేశారు.

సాంస్కృతిక పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్పెట్రాజ్ నిర్వహించిన జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీల్లో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. గ్రూప్ ఫోక్ డాన్స్‌లో ప్రథమస్థానం, గ్రూప్‌ఫోక్ సింగింగ్‌లో ప్రథమస్థానం, చిత్రలేఖనంలో జిల్లా స్థాయిలో ప్రథమస్థానం పొందినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా వారు ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

అయ్యప్పకు లక్షపత్రి పూజ

ఆత్రేయపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ర్యాలి అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం భక్తుల సహకారంతో ప్రధాన అర్చకుడు రఘు ఆధ్వర్యంలో గణపతి హోమం, ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజా మహోత్సవం సహస్ర జ్యోతిలింగార్చన కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో అయ్యప్పదీక్షదారులు పాల్గొన్నారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అయ్యప్పశరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

ఆత్రేయపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. మండలంలోని 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల ద్వారా బుధవారం నుంచి కొనుగోళ్లు ప్రారంభించారు. వెలిచేరు సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలును ప్రారంభించి మిల్లర్లకు తరలించారు.





రామచంద్రపురంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో గృహ మంజూరు పత్రాలు అందజేస్తున్న మంత్రి సుభాష్, ఆర్డీవో అఖిల. పక్క చిత్రంలో రావులపాలెం మండలం దేవరపల్లిలో గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యానందరావు

అధికారం చేపట్టిన 17 నెలల్లో 3 లక్షల ఇళ్లు పూర్తి

గృహ ప్రవేశ కార్యక్రమంలో మంత్రి సుభాష్

ద్రాక్షారామ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సొంత ఇల్లులేని పేదలకు ఇళ్లు ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 17 నెలల్లో రాష్ట్రంలో 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిందని మంత్రి సుభాష్ అన్నారు. బుధవారం వెల్లలో సామూహిక గృహ ప్రవేశాల్లో మంత్రి పాల్గొన్నారు. తొలుత పూజలు నిర్వహించి పెద్దిరెడ్డి సూర్యకుమారి, ఏడుకొండలు దంపతులు, మల్రెడ్డి సునీత, జానకి రామయ్య దంపతులకు నూతన వస్త్రాలు అందించి గృహ ప్రవేశం చేయించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పీఎం ఆవాస్ యోజన, బీఎల్‌సీ పథకంలో నిర్మించిన 2,28,034 ఇళ్లు, పీఎంఏవై క్రింద 65,292 ఇళ్లు, పీఎంఏవై జన్మన్ పథకం కింద 6,886 ఇళ్లలో గృహ ప్రవేశాలు జరిగాయన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 8,867 మందికి ఇళ్లు నిర్మించామన్నారు. రామచంద్రపురంలో 12వ వార్డులో శిరిగినీడి దుర్గా ప్రసాద్‌కు ఏవైబీఎల్‌సీ 2.0 పథకంలో మంజూరైన నిర్మించనున్న గృహానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో దేవరకొండ అఖిల, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, గృహనిర్మాణశాఖ ఈఈ బి.వెంకట రమణ, డీఈ రాంబాబు, ఎంపీడీవో కె.పద్మ జ్యోతి, టీడీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, టీడీపీ నాయకులు ఆకుల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నిజం చేస్తాం

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల సొంత ఇంటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి అన్నారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో పీఎంఏవై అర్బన్ పథకంలో 77 మందికి మంజూరైన గృహ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు మంత్రితో పాటు, ఆర్డీవో అఖిల అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రిష్వంత్‌రాయ్, ఆర్డీవో అఖిల, గృహ నిర్మాణశాఖ పీడీ ఎంవీ నరసింహారావు, ఈఈ వెంకటరమణ, డీఈ రాంబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వుండవిల్లి శివ, ఉపాధ్యక్షుడు చందమామ వాసు, మాజీ ఏఎంసీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్లు కట్టా నాగేశ్వరరావు, మేడిశెట్టి సూర్యనారాయణ, మాజీ కౌన్సిలరు అల్లం శ్రీనివాస్, కంచుమర్తి బాబూరావు, నారపురెడ్డి బలరామ్, దిగుమర్తి వీరబాబు, ఏలూరు ఏసుదాసు, బళ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ అందజేస్తాం

రావులపాలెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ గృహాలు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండలం దేవరపల్లిలో నిర్వహించిన సామూహిక గృహప్రవేశంలో ఆర్డీవో శ్రీకర్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. కేతా లక్ష్మీదుర్గ గృహ ప్రవేశం చేసుకోగా వారి ఇంటికి వెళ్లి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ సొంత ఇంటి కలను నిజం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం స్థానిక కల్యాణ మండపంలో మం డల, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌ల బూత్ కమిటీ ల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశాల మేరకు పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచనల ప్రకా రం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అనంతరం కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నియమించిన కమిటీలతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సూచించిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో కార్యకర్తలకు ఎమ్మెల్యే వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసిరెడ్డి రాంబాబు, ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం

రావులపాలెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల అగ్నిప్రమాదం కారణంగా నష్టపోయిన బాధితులకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆర్థికసాయం అందజేశారు. దేవరపల్లిలో పట్టా రాంబాబుకు చెందిన ఇల్లు అగ్ని ప్రమాదానికి గురైంది. దీంతో బుధవారం ఎమ్మెల్యే పలువురు నాయకులతో కలిసి వారిని పరామర్శించి బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం తరఫున ఇంటి నిర్మాణం జరిగేలా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన సదస్సు

ఆత్రేయపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబెల్ ఫౌండేషన్ సహకారంతో కిమ్స్ మెడ్ యునైటెడ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం క్యాన్సర్ స్క్రీనింగ్ అవగాహన శిబిరం నిర్వహించారు. మెడ్ యునైటెడ్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, గ్లోబెల్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ నడింపల్లి రాంబాబురాజు పాల్గొన్నారు. కిమ్స్ ఆసుపత్రికి చెందిన వైద్య బృందం క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.రామరాజు, పీఎస్ రాజు, చిలువూరి రామకృష్ణంరాజు, బాబిరాజు, ముదునూరి రామభద్రరాజు, గ్లోబెల్ ఫౌండేషన్ లైసన్ పర్సన్ గాదిరాజు ప్రసాదరాజు తదితరులు శిబిరంలో సేవలందించారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

కపిలేశ్వరపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంగరలోని నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద అయ్యప్పస్వామి పడిపూజ జరిగింది. బోనం నాగపండు, బి. శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు అయ్యప్ప మాలధారులు, భక్తులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొని పూజలను తిలకించారు. కేరళ వాయిద్యాలతో స్వామివారి ఊరేగింపు, లక్షబిల్వార్చన, ఏకాదశ అభిషేకాలు, పడిపూజ తదితర కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే బ్యాంక్ లక్ష్యం

రాయవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని వెదురుపాక యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎల్.మహేష్ అన్నారు. బుధవారం వెదురుపాకలో యూనియన్ (ఆంధ్రా బ్యాంక్) బ్యాంక్ ప్రారంభించి ఇరవై ఏళ్లు పూర్తయిన సందర్భంగా బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు కేక్ కట్ చేశారు. మేనేజర్ మహేష్ మాట్లాడుతూ వెదురుపాకలో 2005లో విజయదుర్గా పీఠాధిపతి గాడ్ చేతులమీదుగా దీన్ని ప్రారంభించారన్నారు. విశ్రాంత లెక్చరర్ సుబ్రహ్మణ్యం, హరిశ్చంద్ర తదితరులు యూనియన్ బ్యాంక్ అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీఠం ప్రతినిధి వడ్డాది రాం బాబు, యానిమేటర్లు నాగమణి, ప్రసన్నకుమారి, శాంత కుమారి, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.



వెదురుపాక యూనియన్ బ్యాంక్‌లో కేక్ కట్ చేస్తున్న మేనేజర్, ఖాతాదారులు

మండపేటలో పోలీసుల కార్బన్ సెర్చ్

• రికార్డుల్లేని 25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం • అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు • డీఎస్పీ రఘువీర్ పర్యవేక్షణ



గొల్లపుంతకాలనీలో కార్బన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మండపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గొల్లపుంత కాలనీలోని టిడ్కో సముదాయంలో రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ సారథ్యంలో బుధవారం పోలీసులు పలు ఇళ్లను తనిఖీలు చేశారు. రికార్డుల్లేని ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో పలు అంశాలపై పోలీసులు ఆరాతీశారు. కాలనీలోని 1,632 ప్లాట్‌లను తనిఖీ నిర్వహించామని డీఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో 25 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. కాలనీలో ఒకరిని అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఈ దాడుల్లో డివిజన్ పరిధిలో గల 76 మంది పోలీసు సిబ్బందితో పాటు మండపేట రూరల్, అర్బన్ సీఐలు సురేష్, దొరరాజు తదితరులతో పాటు మండపేట, మండపేట రూరల్, అంగర, రాయవరం ఎస్‌ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లలో రాళ్ల తొలగింపు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం కాకినాడ రోడ్డులోని సర్వేనెం 329/పిలో ఎకరం భూమిలో అనధికార లే అవుట్‌లో పురపాలక సంఘం ప్రణాళిక విభాగం అధికారులు రాళ్లను తొలగించారు. లేఅవుట్‌కు అనుమతులు తీసుకున్న తరువాత మాత్రమే ప్లాట్లు తొలగించి అమ్మకం చేయాలని లే అవుట్ యజమానిని హెచ్చరించారు. అనధికార లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి అనుమతులు మంజూరు చేయడం జరగదని తెలిపారు. అధికార లేఅవుట్‌లలో మాత్రమే ప్లాట్లు కొనుగోలు చేయాలని ప్రజలకు సూచించారు.



అనుమతిలేని లేఅవుట్లలోని రాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

'మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు'

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వైసీపీ రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. బుధవారం రామచంద్రపురంలో ప్రజా ఉద్యమర్యాలీ నిర్వహించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ జరిపారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ తదితరులు పాల్గొన్నారు.

మండపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో నిర్మించిన 17 మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ మండపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జీ తోట త్రిమూర్తులు సారథ్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆపార్టీశ్రేణులు స్థానిక కార్యాలయం నుంచి బయలుదేరి మండపేట తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం తహసీల్దార్ తేజేశ్వరరావుకు వారు వినతిపత్రం అందజేశారు.